# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

13.2.2026 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 212 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




# ఎయిర్‌పోర్టులకు అనుమతులివ్వండి



## 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

2

## మామునూరు పనులు ప్రారంభించండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి సీఎం రేవంత్ వినతి
- కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం భేటీ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు ఆహ్వానం
- రక్షణ భూములను బదలాయింపు చేయాలని విన్నపం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, సహాయం కోరారు. భేటీలో మామూనూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మామూనూరు విమానాశ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో

మిగతా 2 లో



4

## లంబోర్గిని ప్రమాద కేసు

- డ్రైవర్ డ్రామాకు కోర్టు చెక్..
- వ్యాపారి కుమారుడి అరెస్ట్
- ఢిల్లీ ఆస్పత్రిలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



## జాహ్నవి కుటుంబానికి 262 కోట్ల పరిహారం

- రెండేళ్ల తర్వాత దక్కిన న్యాయం
- సియాటెల్ నగర యంత్రాంగం చారిత్రాత్మక నిర్ణయం
- అమానవీయంగా ప్రవర్తించిన అధికారుల బర్తరఫ్

4

## మోదీ విదేశీ పర్యటనల ఖర్చు 462.58 కోట్లు

- 2021-2025 మధ్య 43 దేశాల సందర్శన
- అమెరికా పర్యటనలకే అత్యధిక వ్యయం



ప్రధాని మోడీ విదేశీ పర్యటనలపై అయ్యే ఖర్చుపై కేంద్ర ప్రభుత్వం కీలక గణాంకాలను వెల్లడించింది. 2021 నుండి 2025 మధ్య కాలంలో అంటే గత నాలుగేళ్లలో ప్రధాని చేసిన విదేశీ ప్రయాణాల కోసం భారత ఖజానా నుండి సుమారు రూ. 462.58 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. మొత్తం 43 దేశాలను సందర్శించి, అంతర్జాతీయ వేదికలపై దౌత్య సంబంధాల బలోపేతానికి కృషి చేశారు.

4

## రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

### లోక్‌సభలో బీజేపీ ఎంపీ తీర్మానం

రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవే శపెట్టారు. ఆయన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పదోవ పట్టిం చారని ఆరోపిస్తూ నిషికాంత్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.



4



2

## కార్మిక చట్టాలకు నిరసనగా భారత్ బంద్

- సింగరేణిలో పూర్తిగా నిలిచిన పనులు
- ప్రభుత్వ, ప్రైవేటు సేవలకు అంతరాయం
- రవాణా రంగంలో కొంతమేర ప్రభావం

తెలంగాణలో పలుచోట్ల ఆందోళనలు





## పంచాయతీలకు మరో 387 కోట్లు

2

ఫలించిన మంత్రి సీతక్క వినతి

# నేడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు

3



## పార్టీ పెట్టడం పక్కా

- ఉద్యమకారులకు అన్యాయం జరిగింది
- అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది
- నా పక్కన పైరవీకారులు ఎవరూ లేరు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



3



2

## పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

- అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలి
- ముందు జాగ్రత్త చర్యలపై అధికారులతో సీఎస్ సమీక్ష

## ఎగిరేది గులాబీ జెండాయే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం కచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు.



3

# కార్మిక చట్టాలకు నిరసనగా భారత్ బంద్

- తెలంగాణలో పలుచోట్ల ఆందోళనలు,
- సింగరేణిలో పూర్తిగా నిలిచిన పనులు
- ప్రభుత్వ, ప్రైవేటు సేవలకు అంతరాయం
- రవాణా రంగంలో కొంతమేర ప్రభావం



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన భారత్ బంద్ తెలంగాణలో ప్రభావం చూపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కార్మిక సంఘాలు, రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళనలకు దిగడంతో సాధారణ జీవన విధానం కొంత మేర అంతరాయానికి గురైంది. సమ్మె ప్రభావంతో కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో హాజరు తగ్గింది. రవాణా రంగంలో కొంతమేర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో డ్రైవర్లు బస్సులు, ఆటోలు, కార్లను నిలిపివేసి బంద్‌కు మద్దతు ప్రకటించారు. రోడ్డుపై వాహనాలను ఆపడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల ప్రజలు కాలినడకన లేదా ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. సింగరేణి ప్రాంతంలో కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనడంతో కొంతమేర పనులు నిలిచిపోయాయి. బ్యాంకింగ్, బీమా, రవాణా రంగాల్లో కూడా సేవలకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా భారత్ బంద్‌కు కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు కార్మికులు, రైతులకు అనుకూలంగా లేవని ఆరోపిస్తూ ఈ సమ్మె చేపట్టినట్లు సంఘాల నేతలు తెలిపారు. ఇప్పటికే జనవరి 9న వివిధ కార్మిక సంఘాలు ఐక్యంగా దేశవ్యాప్త సమ్మె నిర్వహించాలని ప్రకటించాయి. అయితే రాష్ట్రంలో ఎక్కువచోట్ల పరిస్థితి ప్రశాంతంగానే కొనసాగినట్లు పోలీసులు తెలిపారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. సమ్మె నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

### సింగరేణిలో కార్మిక సమ్మె ప్రభావం

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సింగరేణి రామగుండం ఏరియాలోని ఆర్జీ-3, ఆర్జీ-2, ఏపీఏ ప్రాంతాల్లో పనులు పూర్తిగా స్థంభించాయి. పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనడంతో భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. సమ్మెలో బీఎంఎస్ మినహా మిగతా అన్ని కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచే కార్మికులు విధులను బహిష్కరించి గనుల వద్ద ఆందోళనలు చేపట్టారు. గోదావరిఖని రెండో బొగ్గు గని ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల హక్కులు దెబ్బతింటాయని, ఉద్యోగ భద్రత తగ్గిపోతుందని నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న సింగరేణి బ్లాక్‌లను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సమ్మె ప్రభావంతో రామగుండం ఏరియాలో ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయినట్లు సమాచారం. ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

# పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

### అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలి

### ముందు జాగ్రత్త చర్యలపై అధికారులతో సీఎస్ సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** భారీ పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు, కార్మికుల భద్రతకు ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉన్నతాధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, చర్యలపై స్పష్టమైన ఒక మాన్యువల్ ను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిగాచి ఇండస్ట్రీస్‌లో జరిగిన దుర్ఘటనపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈ ప్రమాదంలో మరణించిన కార్మికుల, బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు, కోర్టు కేసుల పురోగతిపై సంబంధిత విభాగాల ఉన్నతాధి కారులతో సీఎస్ సమీక్ష చేశారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా భారీ, మధ్యతర, చిన్నతరహా పరిశ్రమలలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలలో వివిధ విభాగాలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించుకోవడానికి జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు రెగ్యులర్ మానిటరింగ్ ఉండే విధంగా అధికారులతో తనిఖీ నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, పరిశ్రమలు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులతో కూడిన తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే అన్ని విభాగాల అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని సి.ఎస్ అన్నారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు, భద్రతా ఆడిట్, అలాగే కార్మికుల భద్రతకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సి.ఎస్ సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం



చేశారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సంజయ్ కుమార్, దాన కిషోర్, ఫైర్ సర్వీస్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# గర్భిణీ మహిళ రక్షణకు చర్యలు

### మానవ హక్కుల కమిషన్ ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** లంగాణ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన గురువారం మహేష్ ఫిర్యాదును పరిశీలించింది. యాదగిరిగుట్ట ఆలయంలో భాగ్యతో లవ్ మ్యారేజ్ చేసుకున్న అనంతరం, ఆ వివాహానికి వ్యతిరేకంగా ఉన్న ఆమె తండ్రి మరియు బావ కలిసి కల్వకుర్తి సమీపంలోని ఆసుపత్రిలో ఆమె నాలుగు నెలల గర్భాన్ని బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నించారని, ఈ తీవ్ర ఒత్తిడి కారణంగా ఒక దశలో ఆమె ఆత్మహత్యకు కూడా ప్రయత్నించిందని, అలాగే పోలీసుల వైపు నుంచి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం ద్వారా నిర్లక్ష్యం జరిగిందని పేర్కొన్న ఆరోపణలను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మహిళ స్వేచ్ఛా, స్వచ్ఛంద సమ్మతి లేకుండా గర్భస్రావం చేయడం చట్టపరంగా తీవ్రమైన నేరమని పేర్కొన్న హక్కుల కమిషన్. కల్వకుర్తి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, వంగూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను తక్షణమే ఫిర్యాదుపై స్పందించి చట్టప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని, నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో వ్యవహారాన్ని పర్యవేక్షించాలని ఆదేశిస్తూ, ఈ విషయంపై 26.02.2026 నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని మరియు అత్యవసరంగా సంబంధిత అధికారులకు ఉత్తర్వులు తెలియజేయాలని ఆదేశించింది. ఇదిలావుంటే తెలుగు దినపత్రికలో 'అల్లరి చేస్తున్నాడని కన్నుపోయేలా దాడి? బాలుడిపై అంగన్వాడీ టీచర్ దాష్టీకం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా నివేదికను సుమోటోగా కేసు నమోదుచేశారు. ఈ అంశం పై వివరణాత్మక నివేదికను సమర్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వారిని ఆదేశించారు.

# ఎయిర్‌పోర్టులకు అనుమతులివ్వండి

మొదటి పేజీ తరువాయి

స్థలం గుర్తించినందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం వెంట ఎంపిలు కడియం కావ్య, మల్లు రవి తదితరులు ఉన్నారు.

### రాజ్‌నాథ్ సింగ్‌తో రేవంత్ భేటీ

మూసీ పునరుద్ధరణలో భాగంగా హైదరాబాద్‌లో నిర్మించబోతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు హాజరు కావాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు.అలాగే ఈ ప్రాజెక్టుకు అవసరమైన రక్షణ భూములను బదలాయించాలని వేడుకున్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. గురువారం ఉదయం దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో



నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈసా.. మూసీ నదుల సంగమ స్థలంలో కార్యక్రమం చేపడుతున్నట్లు రక్షణ మంత్రికి సీఎం వివరించారు. 1948 ఫిబ్రవరిలో మహాత్ముని చితభస్మాన్ని ఈసా.. మూసీ సంగమ స్థలిలో నిమజ్జనం చేశారని కేంద్ర మంత్రికి తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు.అంతకు ముందు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయాలు, పరిపాలన అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించారు. దావోస్ పర్యటన, హార్వర్డ్ శిక్షణ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను వివరించారు. రేవంత్ రెడ్డి కొందరు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను వారి దష్టికి తీసుకెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంటుకు వెళ్లి ఎంపీలను కలిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.





# పంచాయతీలకు మరో రూ.387 కోట్లు విడుదల

### ఫలించిన మంత్రి సీతక్క వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి సీఎండీగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు, సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

# పారామెడికల్ కాలేజీ ఫీజు మదింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** రాష్ట్రంలోని పారా మెడికల్ కళాశాలల్లో చదివే దాదాపు 30 వేల మంది విద్యార్థుల ఫీజు స్ట్రక్చర్ వివరాలను ఈ-పాస్‌లో వెంటనే అప్లోడ్ చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమా శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పారా మెడికల కళాశాలల్లో చదువుతున్న ఎస్.సి. ఎస్.టి, బీ.సి లకు చెందిన విద్యార్థులకు సంబందించిన ఫీజు స్ట్రక్చర్‌ను 2024 -25 నుండి ఈ-పాస్ లో పెట్టనందున దాదాపు 30 వేల మంది విద్యార్థులు స్కాలర్షిప్స్ కోల్పోయే ప్రమాదం ఉందని పారా మెడికల అసోసియేషన్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్, రావు, కార్యదర్శి మోహన్ రెడ్డి లు నేడు మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిన సంబంధిత అధికారులను ఆదేశించారు.

# స్పోర్ట్స్ హ్యాకథాన్ పోస్టర్, లోగో ఆవిష్కరణ

### గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు మంత్రి వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి12 :** హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో స్పోర్ట్స్ హ్యాకథాన్‌కు పోస్టర్ / లోగోను మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, హ్యాకథాన్ నిర్వహకులు సందీప్ కుమార్ మక్తాలు ఆవిష్కరించారు. ప్రపంచంలోనే మొదటి, అతిపెద్ద స్టేడియం స్థాయి స్పోర్ట్స్ ఇన్నోవేషన్ లీగ్ అయిన స్పోర్ట్స్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య, క్రీడా, యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. స్పోర్ట్స్ హ్యాకథాన్ కేవలం ఒక పోటీ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది క్రీడలు మరియు సాంకేతికతను సమన్వయం చేసే విశ్వస్థాయి ఉద్యమమని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ హ్యాకథాన్‌లకు భిన్నంగా, ప్రొఫెషనల్ స్టేడియంలో నిర్వహించబడే ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ప్రత్యక్షంగా క్రీడల్లో పాల్గొని, ఆ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని క్రీడలకు సంబంధించిన వాస్తవ సమస్యలకు సృజనాత్మక మరియు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందిస్తారని తెలిపారు. తెలంగాణలోని అన్ని 33 జిల్లాల నుండి యువత, క్రీడాకారులు, విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు మరియు స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, సుమారు 10,000 మంది పాల్గొనేవారిని సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. అంతేకాకుండా, కొంతమంది అంతర్జాతీయ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననుండటం విశేషమన్నారు. ప్రపంచంలోనే మొదటి స్టేడియం స్థాయి స్పోర్ట్స్ హ్యాకథాన్ కావడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించే దిశగా కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ వినూత్న నమూనా ద్వారా తెలంగాణను క్రీడా ఆవిష్కరణల గ్లోబల్ కేంద్రంగా నిలబెట్టడం మా లక్ష్యమని స్పష్టం చేశారు.





# పార్టీ పెట్టడం పక్కా

## ఉద్యమకారులకు అన్యాయం జరిగింది

## అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది

## నా పక్కన పైరవీకారులు ఎవరూ లేరు

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని, అది 'తెలంగాణ' అస్తిత్వమే ఊపిరిగా పనిచేస్తుందని ఆమె ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో జరిగిన 'ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ'లో పాల్గొన్న ఆమె, తన సొంత తండ్రి కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వంపైనే పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ రాజకీయ వర్గాల్లో కలకలం రేపారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవం, న్యాయం జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. "ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి (కేసీఆర్) అధికారం కోల్పోయారు. గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే ఓడిపోయారు. అప్పట్లో ఎవరిని గెలిపించినా బీఆర్ఎస్‌లోకే వెళ్తారన్న పరిస్థితి ఉండటం వల్ల ప్రజాస్వామ్య విలువలు కనుమరుగయ్యాయి" అని వ్యాఖ్యానించారు. నాడు జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలని మంత్రి కేటీఆర్‌ను పదేపదే కోరినా సుప్రీంకోర్టు తీర్పుల సాకుతో పట్టించుకోలేదని, ఆంధ్రా పాలకుల విగ్రహాలు తొలగిస్తారని ఆశించినా అది నెరవేరలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని కూడా ఉద్యమకారులు క్షమించరని కవిత హెచ్చరించారు. ఉద్యమానికి వ్యతిరేకంగా గన్ పట్టుకుని తిరిగిన రేవంత్ రెడ్డికి తెలంగాణ సోయి లేదని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులకు అండగా ఉండాల్సిన ప్రొఫెసర్ కోదండరాం రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తక్షణమే రానున్న బడ్జెట్ సమావేశాల్లో 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు'ను ప్రకటించాలని, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. తన వెంట ఎలాంటి పైరవీకారులు లేరని, కేవలం నిఖార్సైన ఉద్యమకారులే ఉన్నారని కవిత స్పష్టం చేశారు. తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తేల్చి చెప్పారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్తిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాగృతి ఇకపై కేవలం సాంస్కృతిక సంస్థగా కాకుండా బలమైన రాజకీయ శక్తిగా మారుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారుల వివరాల సేకరణ కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. ఉద్యమకారుల ఆకాంక్షలే అజెండాగా తమ పార్టీ భవిష్యత్తు కార్యచరణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

# కరీంనగర్ బీజేపీదే!

## గెలిచిన తర్వాత కొండగట్టుకు పాదయాత్ర

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్, ఫిబ్రవరి 12: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేయబోతోందని, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశం కరీంనగర్ ఫలితాల వైపు చూస్తోందని, కార్యకర్తల కష్టం వృథా పోదని ఆయన పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగవద్దు: బీజేపీకి మెజారిటీ స్థానాలు వస్తున్నాయనే సమాచారంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైందని బండి సంజయ్ విమర్శించారు. "కాంగ్రెస్ నేతలు అప్పుడే ఫోన్లతో ప్రలోభాల స్కెచ్‌కు తెరతీశారు. బీజేపీ అభ్యర్థులను గుంజాలని చూస్తున్నారు, అందరూ జాగ్రత్తగా ఉండండి" అని హెచ్చరించారు. పార్టీని మోసం చేస్తే కన్నతల్లిని మోసం చేసినట్లేనని, ప్రలోభాలకు లోబడి పార్టీ మారితే కార్యకర్తల ఆగ్రహాన్ని తట్టుకోవడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో చిన్న పొరపాటు జరిగినా నష్టం వాటిల్లుతుందని, ఏజెంట్లు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ.. "ప్రత్యర్థులు గొడవలు సృష్టించి దృష్టి మళ్లించే ప్లాన్ చేస్తారు. ఏజెంట్ల దృష్టి అంతా బ్యాలెట్ పేపర్ మీదే ఉండాలి. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలి తప్ప గొడవ పడొద్దు" అని వివరించారు. ఈ ఎన్నికల్లో తమ గెలుపు కోసం బండి సంజయ్ అందించిన ఆర్థిక సాయం, సహకారం మరువలేనిదని అభ్యర్థులు భావోద్వేగానికి లోనయ్యారు. "మీ మేలు జన్మలో మరువలేం" అంటూ సంజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఫలితాల అనంతరం అందరం కలిసి కరీంనగర్ నుండి కొండగట్టు అంజన్న క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు చెల్లించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావు, బాస సత్యనారాయణ, గుగ్గిళ్ల రమేశ్ తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.



# నేడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

## ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నేడు (ఫిబ్రవరి 13) ఉదయం 8 గంటలకు నిర్దేశిత కేంద్రాల్లో లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం అవసరమైన సూపర్ వైజర్లు, అసిస్టెంట్లను ఇప్పటికే నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రాల పరిసరాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (నిషేధాజ్ఞలు) అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. కౌంటింగ్ హాల్ లోపలికి కేవలం సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఎలక్షన్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. వీరందరూ తప్పనిసరిగా జారీ చేసిన పాసులు కలిగి ఉండాలి. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి అనుమతించరు. పారదర్శకత కోసం అన్ని కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఇటీవల ముగిసిన ఈ ఎన్నికల్లో 73.01 శాతానికి పైగా పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టి, అది పూర్తయ్యాక సాధారణ బ్యాలెట్ బాక్సులను తెరుస్తారు. వార్డులవారీగా బ్యాలెట్ బాక్సులను టేబుల్ వద్దకు తీసుకువచ్చి, ఒక్కో పోలింగ్ స్టేషన్ ఓట్లను 25 చొప్పున కట్టలుగా కడతారు. మిగిలిన చిల్లర ఓట్లను (25 కంటే తక్కువ ఉంటే) విడిగా ఉంచి స్లిప్ అంటిస్తారు. ఆయా పోలింగ్ స్టేషన్ల వివరాలు నమోదు చేసిన తర్వాత, వార్డులోని అన్ని బ్యాలెట్ కట్టలను ఒక పెద్ద డ్రమ్ములో వేసి బాగా కలుపుతారు. దీనివల్ల ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయో తెలియకుండా గోప్యత పాటించవచ్చు. అసంపూర్తిగా ఉన్న కట్టలను సాధ్యమైనంత వరకు కలిపి పూర్తి కట్టలుగా మారుస్తారు. మిగిలిన చిల్లర ఓట్లను విడిగా ఉంచి లెక్క రాస్తారు. ఈ ప్రక్రియను ప్రతి వార్డుకూ ఇదే రీతిలో అనుసరిస్తారు.

# 15న సంత్ సేవాలాల్ జయంతి

## బంజారా భవన్‌లో కార్యక్రమాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు హైదరాబాద్లో ఉన్న బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారా భవన్లో లంబాడీ గిరిజనుల సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఘనంగాజరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని గౌ. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ.రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు స్పెషల్ లీవ్ శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని ఎమ్మెల్యే నియోజకవర్గాలలో జరుగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.



# 44వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు

## పారదర్శకంగా జర్నలిస్టులకు న్యాయం

## సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# ఎగిరేది గులాబీ జెండాయే

- శేరిలింగంపల్లి నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

## లోక్‌సభలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె తీర్మానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ నిషికాంత్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని దూబే కోరారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రాహుల్ సోరస్ సంస్థతో చేతులు కలిపి దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ ఈరోజు లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. నేను ప్రతిపాదించిన తీర్మానంలో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితకాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అభ్యర్థించాను' అని అన్నారు. కాగా, నిన్న రాహుల్‌గాంధీ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని, భరతమాతను అమ్మేశారని వ్యాఖ్యానించారు. మరుసటి రోజే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశార. ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు.

# లంబోర్గిని ప్రమాద కేసు

## డ్రైవర్ డ్రామాకు కోర్టు చెక్..

## పొగాకు వ్యాపారి కుమారుడి అరెస్ట్

## ఢిల్లీ ఆస్పత్రిలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

**కాన్పూర్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారులపైకి లగ్జరీ లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో ప్రధాన నిందితుడు, ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివం మిశ్రాను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ప్రమాదం జరిగిన నాలుగు రోజుల తర్వాత, ఢిల్లీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో బుధవారం ఒక నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. శివం మిశ్రాను కాపాడే ప్రయత్నంలో భాగంగా మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోయేందుకు ప్రయత్నించాడు. ప్రమాద సమయంలో శివం మూర్ఛపోయాడని, తానే కారు నడిపానని అతను కోర్టుకు వివరించాడు. అయితే, పోలీసుల దగ్గర ఉన్న వీడియో ఆధారాలు అసలు నిజాన్ని బయటపెట్టాయి. ప్రమాదం జరిగిన వెంటనే శివం మిశ్రానే డ్రైవర్ సీటులో ఉన్నట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. దీంతో పోలీసులు కోర్టుకు గట్టి ఆధారాలు సమర్పించడంతో, మోహన్ లొంగిపోవడాన్ని న్యాయస్థానం నిరాకరించింది. నిందితుడిని రక్షించేందుకు తప్పుడు సాక్ష్యం చెప్పినందుకు మోహన్‌పై కూడా విచారణ జరిపే అవకాశం ఉంది.

### అసలేం జరిగింది?

గత ఆదివారం మధ్యాహ్నం కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో అతివేగంతో వచ్చిన లంబోర్గిని కారు అదుపు తప్పి మొదట ఒక ఈ-రిక్షాను, ఆ తర్వాత పాదచారులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో 18 ఏళ్ల ఈ-రిక్షా డ్రైవర్ మహ్మద్ తౌఫీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేశారు. "శివం మిశ్రానే కారు నడిపాడని నిరూపించడానికి మా వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయి. నిందితుడిని ఢిల్లీలో అరెస్ట్ చేశాం, త్వరలోనే కోర్టులో హాజరుపరుస్తాం" అని పోలీస్ కమిషనర్ రఘుబీర్‌లాల్ తెలిపారు. అధికారం, డబ్బు ఉన్నా చట్టం ముందు అందరూ సమానమేనని ఈ అరెస్టుతో పోలీసులు స్పష్టం చేశారు.



# జాహ్నవి కుటుంబానికి 262 కోట్ల పరిహారం

## రెండేళ్ల తర్వాత దక్కిన న్యాయం

## సియాటెల్ నగర యంత్రాంగం చారిత్రాత్మక నిర్ణయం

## అమానవీయంగా ప్రవర్తించిన అధికారుల బర్తరఫ్



**న్యూఢిల్లీ/కర్నూలు, ఫిబ్రవరి 12:** అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యానికి బలైపోయిన కర్నూలు యువతి కందుల జాహ్నవి (23) మృతి కేసులో అక్కడి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. జాహ్నవి కుటుంబం దాఖలు చేసిన సివిల్ దావాపై స్పందించిన సియాటెల్ నగర యంత్రాంగం, 29 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 262 కోట్లు) భారీ పరిహారాన్ని చెల్లించేందుకు అంగీకరించింది. ఈ మేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే.. 2023 జనవరి 23న సియాటెల్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్న జాహ్నవి, రోడ్డు దాటుతుండగా అతివేగంతో వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ఆ సమయంలో అధికారి కెవిన్ డేవ్ గంటకు 119 కిలోమీటర్ల వేగంతో కారును నడిపినట్లు తేలింది. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే మరణించింది. ఈ ఘటన తర్వాత మరో పోలీసు అధికారి డేనియల్ అడరర్ బాడీ కెమెరాలో రికార్డైన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపాయి. జాహ్నవి మరణాన్ని ఎగతాళి చేస్తూ.. "ఆమెది పరిమితమైన విలువ ఉన్న జీవితం, 11 వేల డాలర్లు ఇచ్చి చెక్ రాసిస్తే సరిపోతుంది" అంటూ అతను నవ్వుతూ మాట్లాడటం భారతీయుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. భారత ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని అమెరికా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలకు డిమాండ్ చేసింది. అమానవీయంగా మాట్లాడిన డేనియల్ అడరర్ తో పాటు, కారు నడిపిన కెవిన్ డేవ్‌ను కూడా సియాటెల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ విధుల్లో నుంచి తొలగించింది. తొలుత నిందితులపై క్రిమినల్ కేసులు లేవని కోర్టు ప్రకటించినా, కుటుంబ సభ్యులు పట్టుదలతో పోరాడి ఈ భారీ సివిల్ సెటిల్‌మెంట్‌ను సాధించారు. "జాహ్నవి ప్రాణం చాలా విలువైనది.. ఆమె మరణం అత్యంత బాధాకరం" అని సియాటెల్ నగరం అధికారికంగా విచారం వ్యక్తం చేస్తూ పరిహారాన్ని ప్రకటించింది. ఈ తీర్పుపై జాహ్నవి కుటుంబ సభ్యులు మరియు ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుతో ప్రాణాన్ని వెనక్కి తీసుకురాలేమని, కానీ బాధ్యత గల అధికారుల నిర్లక్ష్యంపై ఇది గట్టి హెచ్చరిక అని వారు పేర్కొంటున్నారు.

# మోదీ విదేశీ పర్యటనల ఖర్చు 462.58 కోట్లు

- 2021-2025 మధ్య 43 దేశాల సందర్శన
- అమెరికా పర్యటనలకే అత్యధిక వ్యయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గత నాలుగేళ్లలో (2021ఉ2025) ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 462.58 కోట్లు వ్యయం చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ కాలంలో ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వ్యూహాత్మక భాగస్వామ్యాల విస్తరణ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడం వంటి లక్ష్యాలతో ఈ పర్యటనలు నిర్వహించినట్లు కేంద్ర వర్గాలు పేర్కొంటున్నాయి.

### అమెరికా పర్యటనలకే అత్యధిక ఖర్చు

మొత్తం వ్యయంలో అత్యధికంగా అమెరికా పర్యటనలకే ఖర్చు అయినట్లు సమాచారం. నాలుగు సార్లు అమెరికా సందర్శనలకు సుమారు రూ. 74.4 కోట్లు, అంటే మొత్తం వ్యయంలో దాదాపు 16శాతం ఖర్చు చేశారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ. 22.8 కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో జరిగిన అమెరికా సందర్శనకు రూ. 19.6 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడైంది. ఈ పర్యటనల్లో క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితి సమావేశాలు, ద్వైపాక్షిక చర్చలు ప్రధాన అజెండాగా నిలిచాయి.

### జపాన్, ఫ్రాన్స్ తర్వాతి స్థానాల్లో

వ్యయంపరంగా జపాన్, ఫ్రాన్స్ దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ రెండు దేశాల పర్యటనలకు కలిపి మొత్తం వ్యయంలో సుమారు 9 శాతం ఖర్చు చేసినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2025లో ఫ్రాన్స్ పర్యటన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలిచినట్లు సమాచారం. ప్రధాని ఒక్కరే పాల్గొన్న ఈ పర్యటన కోసం సుమారు రూ. 25.5 కోట్లు వ్యయం చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గొనడమే కాకుండా, మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2021ఉ2025 మధ్య కాలంలో అమెరికా, యుఎఇ, జపాన్ దేశాలను ఒక్కోటి నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలను రెండుసార్లు చొప్పున సందర్శించినట్లు వివరాలు చెబుతున్నాయి.




### విమర్శలు ఉ సమర్థనలు

దౌత్య సంబంధాల బలోపేతం, పెట్టుబడుల ఆహ్వానం, రక్షణ, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాల పెంపు లక్ష్యంగా ఈ పర్యటనలు నిర్వహించినట్లు ప్రధాని మోదీ పలుమార్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత స్థాయిని పెంచడంలో ఈ విదేశీ పర్యటనలు కీలకమని ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, విదేశీ పర్యటనలపై భారీగా ఖర్చు అవుతున్న నిధులపై ప్రతిపక్షాలు గతంలోనే ప్రశ్నలు లేవనెత్తాయి. దేశంలో ఇప్పటికీ పేదరికం, నిరుద్యోగం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు కొనసాగుతున్న తరుణంలో ఈ వ్యయంపై పునఃపరిశీలన అవసరమని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిధులను ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు మళ్లిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని వారు సూచిస్తున్నారు.

### పారదర్శకతపై డిమాండ్

ప్రధాని విదేశీ పర్యటనల ఖర్చులపై పూర్తి స్థాయి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ప్రతి పర్యటన ఫలితాలపై వైట్‌పేపర్ విడుదల చేయాలని కొందరు రాజకీయ నేతలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో విదేశీ పర్యటనల ప్రణాళికలో ఖర్చు-లాభ విశ్లేషణను స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రయోజనాల కోసం నిర్వహించే విదేశీ పర్యటనలు ఎంతవరకు ఆర్థికంగా సమర్థవంతంగా ఉన్నాయనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.



## సంపాదకీయం

# దివాలా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

దేశవ్యాప్తంగా ఉచిత పథకాల రాజకీయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు భారీగా నగదు బదిలీలు, ఉచిత సరుకులు, సబ్సిడీలు ప్రకటిస్తుండగా, వాటి వల్ల రాష్ట్రాల ఆర్థిక స్థితి దెబ్బతింటోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయ హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుకు నిధులు సమీకరించలేక అప్పులపాలు కావడం పరిపాటిగా మారింది. కొన్ని రాష్ట్రాల్లో అప్పుల భారం పెరిగి, వడ్డీల చెల్లింపులే పెద్ద భారంగా మారాయి. జీతాలు, పెన్షన్లు చెల్లించేందుకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో జీతాల చెల్లింపులపై ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఆర్థిక పరిస్థితి నియంత్రణలోనే ఉందని చెబుతోంది. అప్పుల పరిమాణం లక్షల కోట్లకు చేరుకుందని, భవిష్యత్తులో ఇది మరింత భారంగా మారుతుందనే ఆర్థిక నిపుణుల హెచ్చరికలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ సంక్షేమ పథకాల అమలుపై రాజకీయ ఆరోపణలు కొనసాగుతున్నాయి. ఒక ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను మరొకటి కొనసాగించాల్సి రావడం, వాటిని నిలిపివేయడానికి రాజకీయంగా వెనుకడుగు వేయడం సాధారణమైంది. ఫలితంగా ఖజానాపై ఒత్తిడి పెరుగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సంక్షేమ హామీలతోనే ప్రజలను ఆకర్షించాయి. అధికార పార్టీ తాము అమలు చేసిన పథకాలను వివరించగా, ప్రతిపక్షాలు "ఇవ్వని" హామీల జాబితా చదివాయి. "తులం బంగారం ఇచ్చారా? రైతుబంధు వేశారా? పెన్షన్ నాలుగు వేలిచ్చారా?" వంటి ప్రశ్నలతో పరస్పర విమర్శలు జరిగాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. నగదు బదిలీ పథకాలు, ఉచిత గ్యాస్, ఉచిత రేషన్, ఉచిత విద్యుత్, మహిళలకు నెలవారీ ఆర్థిక సాయం వంటి పథకాలు ఎన్నికల అజెండాలో కీలకంగా మారాయి. ఒకప్పుడు ఉచితాల సంస్కృతిని విమర్శించిన పార్టీలు కూడా ఇప్పుడు పరిస్థితులకు అనుగుణంగా అలాంటి హామీలను ప్రకటిస్తున్నాయి. ఉచితాల రాజకీయాలపై సుప్రీంకోర్టు కూడా గతంలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఉత్పాదక కార్యకలాపాల నుంచి దూరం చేసే విధంగా ఉచితాలు మారకూడదని వ్యాఖ్యానించింది. అయినప్పటికీ రాజకీయ పార్టీలు ఈ హెచ్చరికలను పెద్దగా పట్టించుకోలేదనే అభిప్రాయం ఉంది. సంక్షేమం అవసరమే. పేదల కోసం సామాజిక భద్రతా పథకాలు అవసరం. అయితే అవి మోతాదు మించితే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుంది. ఎక్స్‌ప్రెస్‌వేలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు తగ్గిపోతే దీర్ఘకాలికంగా రాష్ట్రాల ప్రగతికి ఆటంకం కలుగుతుంది. నగదు బదిలీల వల్ల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందనే వాదన ఉన్నప్పటికీ, అది శాశ్వత పరిష్కారం కాదని కొందరు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఉద్యోగ సృష్టి, పారిశ్రామిక వృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు వంటి అంశాలపై దృష్టి పెట్టకపోతే సంక్షేమం తాత్కాలిక ఉపశమనం మాత్రమే అవుతుంది. ఎన్నికల సమయంలో అసాధ్యమైన హామీలను నియంత్రించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేయాలా అనే చర్చ కూడా మొదలైంది. ఒకసారి అమలు చేసిన ఉచిత పథకాన్ని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోలేకపోవడం రాజకీయ వాస్తవం. అందువల్ల ముందుగానే ఆర్థిక సాధ్యతను పరిశీలించే వ్యవస్థ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఓటర్లూ తమ బాధ్యతను గుర్తించాల్సిన సమయం వచ్చింది. తాత్కాలిక లబ్ధి కంటే దీర్ఘకాలిక అభివృద్ధిని ప్రాధాన్యంగా చూడాలి. ఓటు కొనకూడదు, ఓటు అమ్మకూడదు అనే అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో చివరికి నిర్ణయం ప్రజలదే. రాజ్యాంగపరమైన మార్గదర్శకాలు, ఆర్థిక కట్టుదిట్టమైన నిబంధనలు, పారదర్శక బడ్జెట్ విధానం, ఖర్చులపై సామాజిక ఆడిట్ వంటి చర్యలు తీసుకుంటేనే పరిస్థితి మారుతుంది. సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతౌల్యం పాటించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. లేకపోతే ఉచితాల రాజకీయాలు కొనసాగుతూనే ఉంటాయి. అప్పుల చక్రంలో చిక్కుకున్న రాష్ట్రాలు భవిష్యత్ తరాలపై భారాన్ని మోపే ప్రమాదం ఉంది. దివాలా పథకాలకు అడ్డుకట్ట వేయాలంటే రాజకీయ సంకల్పం మాత్రమే కాదు, ప్రజల స్పష్టమైన నిర్ణయం కూడా అవసరం.



# ఒమన్‌పై శ్రీలంక భారీ విజయం

### టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక వరుసగా రెండో విజయం



టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక వరుసగా రెండో విజయం నమోదు చేసింది. కొలంబో వేదికగా ఒమన్ తో గురువారం జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. లంక నిర్దేశించిన 226 పరుగుల ఛేదనలో ఒమన్ తేలిపోయింది. లంక బౌలర్లు విజృభించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులే చేయగలిగింది. దుష్మంత చమీర, మహీష్ తీక్షణ చెరో 2, దునిత్ వెల్లలాగే, డాసున్ హేమంత, కామిందు మెండిస్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ లక్ష్య ఛేదనలో ఒమన్ పవర్ ప్లే లోనే ఒమన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఆమిర్ ఖలీమ్ (6 పరుగులు), జితేందర్ సింగ్ (1 పరుగు), హమ్మద్ మీర్జా (9 పరుగులు) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. అప్పుడు క్రీజులోకి వచ్చిన మహ్మద్ నదీమ్, వాసిమ్ తో కలిసి వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్నాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్ కు 42 పరుగులు జోడించారు. అయితే 11.5 వద్ద వాసిమ్ ను తీక్షణ ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో తొలి బంతికే వినాయక్ శుక్లా (1 పరుగు) ఔట్ అయ్యాడు. ఇక ఒమన్ లో నదీమ్ ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. కానీ, నదీమ్ కావాల్సినంత వేగాంగా పరుగులు చేయలేదు. అతడు ఈ ఇన్నింగ్స్ లో 56 బంతులు ఆడినప్పటికీ చేసింది 53 పరుగులే. ఇందులో మూడు ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. వాసిమ్ అలీ (27 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. ఈ ఇద్దరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ రెండంకెల స్కోర్ చేయలేదు. చివర్లో వికెట్లు పడుతున్న నదీమ్ క్రీజులో నిలబడి తమ జట్టును ఆలౌట్ గండం నుంచి తప్పించాడు.కాగా, టీ20ల్లో పరుగులు పరంగా ఇది శ్రీలంకకు రెండో అతిపెద్ద విజయం. 2007 వరల్డ్ కప్ లో కెన్యాపై 172 పరుగుల భారీ తేడాతో లంక నెగ్గింది. పరుగుల పరంగా లంక జట్టుకు ఇదే భారీ విజయం. అటు ఒమన్ కు ఇదే అతి ఘోర ఓటమి. పొట్టి ఫార్మాట్ లో 100కు పైగా పరుగుల తేడాతో ఒడిపోవడం ఇదే తొలిసారి. గతంలో ఒమన్ 2025 ఆసియా కప్ లో పాక్ పై 93 రన్స్ తో ఓడింది.అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ చేసింది. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండిస్ (61 పరుగులు, 45 బంతుల్లో), పవన్ రత్నాయకే (60 పరుగులు, 28 బంతుల్లో; 8x4, 1x6), డాసున్ శనక (50 పరుగులు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. ఒమన్ బౌలర్లలో జితేన్ రామ్ నంది 2, సఫ్యాన్ మహ్మద్, జయ్ ఒడెద్ర తలో 1 వికెట్ దక్కించుకున్నారు.ఈ టోర్నీలో లంకకు ఇది వరుసగా రెండో విజయం. తొలుత ఐర్లాండ్ పై గెలిచిన లంక, తాజాగా ఒమన్ పై విక్టరీ కొట్టింది. దీంతో గ్రూప్ బీలో 4 పాయింట్లతో టాప్ లో ఉంది. ఇక శ్రీలంక తదుపరి మ్యాచ్ లో ఆస్ట్రేలియా (ఫిబ్రవరి 16), జింబాబ్వే (ఫిబ్రవరి 19) ఆడాల్సి ఉంది.







# ఐపీఎల్‌కు ఎన్నికల సెగ

### 19వ సీజన్ షెడ్యూల్ అలస్యం..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ వేలం ముగిసి రెండు నెలలు కావొస్తోంది. మామూలుగా అయితే ఈ లోపే షెడ్యూల్ విడుదలవ్వాలి. కానీ, బీసీసీఐగానీ, ఐపీఎల్ పాలకమండలిగానీ ఐపీఎల్ షెడ్యూల్ గురించి ఒక్క ప్రకటన చేయలేదు. ఆనవాయితీ ప్రకారం మార్చి ఉ మే నెల మధ్యలో మెగా టోర్నీ జరుగనుందని సమాచారం. కానీ, షెడ్యూల్‌పై బీసీసీఐ మౌనం దాల్చడం వెనుక కారణముందని తెలుస్తోంది. ఎన్నికల నేపథ్యంలోనే షెడ్యూల్‌పై ప్రకటన ఆలస్యం అవుతోందని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. చూస్తుంటే ఐపీఎల్‌కు కూడా అసెంబ్లీ ఎన్నికల సెగ తాకినట్టు అనిపిస్తోంది. నిరుడు డిసెంబర్ 16న అబూధాబీలో 19వ సీజన్ వేలం ముగిసింది. కానీ, ఇప్పటికీ షెడ్యూల్‌పై స్పష్టత లేదు. గత సీజన్ మాదిరిగానే మార్చిలోనే సీజన్ ఆరంభం అవుతుందని టాక్. మార్చి 26 నుంచి మే 31 వరకూ టోర్నీ నిర్వహించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ లెక్కన చూస్తే మెగా టోర్నీ ఆరంభానికి ఇంకో 45 రోజులు ఉన్నాయంతే. అయితే.. త్వరలోనే బెంగాల్, తమిళనాడు, అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. దాంతో.. ఆయా రాష్ట్రాల్లో పోలీసులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉండే అవకాశముంది. అందుకే.. ఐపీఎల్ ఆలస్యమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇదే విషయమై 'ఇన్‌సైడ్ స్పోర్ట్' ప్రతినిధి ఒకరు బీసీసీఐ అధికారులను సంప్రదించగా.. అవునని చెప్పారు. 'ఎన్నికల నేపథ్యంలోనే ఐపీఎల్ షెడ్యూల్ విడుదల చేయడం లేదు. ఒకవేళ ఎన్నికల తేదీ, కౌంటింగ్ తేదీన మ్యాచ్‌లు ఉంటే వేదికను మార్చడం పెద్ద తలనొప్పి. ఎందుకంటే.. పోలీసులంతా ఎన్నిక విధుల్లో నిమగ్నమవుతారు. అప్పుడు స్టేడియాల వద్ద ఆటగాళ్లకు రాష్ట్ర పోలీసులు భద్రత కల్పించలేరు. కాబట్టి.. అధికారులతో మాట్లాడుతూ ఉన్నాం. వారి నుంచి ఎన్నికల తేదీలపై స్పష్టత వచ్చాక ఐపీఎల్ షెడ్యూల్ ప్రకటిస్తాం అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఒకవేళ ఎన్నికలు ఆలస్యమైతే.. రెండు విడతలుగా ఐపీఎల్ నిర్విహించడంపై ఆలోచిస్తాం' అని ఆయన పేర్కొన్నారు. పద్దెనిమిదో సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)జట్టు ఛాంపియన్‌గా అవతరించిన విషయం తెలిసిందే.



# ఆఫ్ఘన్ ఆల్‌రౌండ్‌కి ఐసీసీ బిగ్‌షాక్

బుధవారం జరిగిన ఆఫ్ఘనిస్థాన్- దక్షిణాఫ్రికా మ్యాచ్ ప్రపంచం వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ ఎంత ఉత్కంఠ భరితంగా సాగిందో చెప్పనవసరం లేదు. ఇక ఈ మ్యాచ్ అనంతరం ఆఫ్ఘనిస్థాన్ స్టార్ ఆల్‌రౌండర్ మహ్మద్ నబీకి ఐసీసీ షాక్ ఇచ్చింది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరిత టీ20 మ్యాచ్‌లో అంపైర్లతో వాగ్వాదానికి దిగిన కారణంగా చర్యలు తీసుకుంది. నబీ మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్ల ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.4ను ఉల్లంఘించినట్టు తేలింది. ఈ నిబంధన ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లో అంపైర్ సూచనలను పాటించకపోవడం తప్పుగా భావిస్తారు. ఆఫ్ఘనిస్థాన్ ఇన్నింగ్స్ 14వ ఓవర్ ఆరంభంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దక్షిణాఫ్రికా పేసర్ లుంగీ ఎంగిడీ చేతికి ధరించిన రిస్ట్‌బ్యాండ్ విషయంలో నబీ అంపైర్లను ప్రశ్నిస్తూ వాదనకు దిగారు. అదే ఈ ప్లేయర్‌కు చెడ్డ పేరు తెచ్చింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఇది ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్‌లోనే అత్యంత ఉత్కంఠభరిత పోరుగా నిలిచింది. ఫలితం తేలడానికి రెండు సూపర్ ఓవర్లు అవసరమయ్యాయి. చివరకు దక్షిణాఫ్రికా విజయం సాధించింది. నబీకి ఈ మ్యాచ్ కలిసి రాలేదు. రెండు ఓవర్లు వేసిన నబీ 20 పరుగులు ఇచ్చాడు. బ్యాటింగ్‌లో ఆరు బంతుల్లో ఐదు పరుగులకే పరిమితమయ్యాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్ తరఫున వికెట్ కీపర్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ అద్భుతంగా ఆడాడు. 42 బంతుల్లో 84 పరుగులు చేసి జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. చివర్లో లోయర్ ఆర్డర్ బ్యాటర్లు వేగంగా పరుగులు చేసి స్కోరు సమం చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లింది. మొదటి సూపర్ ఓవర్‌లో అజ్మతుల్లా ఒమర్జాయ్ ఎంగిడీపై రెండు బౌండరీలు, ఒక సిక్స్ కొట్టి 17 పరుగులు సాధించాడు. కానీ దక్షిణాఫ్రికా తరఫున ట్రిస్టన్ స్టబ్స్ రెండు భారీ సిక్సులు బాదడంతో మ్యాచ్ రెండో సూపర్ ఓవర్‌కు చేరింది. రెండో సూపర్ ఓవర్‌లో డేవిడ్ మిల్లర్, స్టబ్స్ కలిసి మూడు సిక్సులు బాదుతూ 23 పరుగులు చేశారు. ఇది పెద్ద లక్ష్యంలా కనిపించినా, గుర్బాజ్ మళ్లీ పోరాడాడు. కేశవ్ మహారాజ్‌పై వరుసగా మూడు సిక్సులు కొట్టి మ్యాచ్‌ను మళ్లీ ఉత్కంఠకు గురి చేశాడు. చివరికి ఔటవడంతో ఆఫ్ఘనిస్థాన్ విజయం అందుకోలేకపోయింది. ఇలా ఉత్కంఠభరిత పోరులో ఓడినా, మ్యాచ్ మాత్రం అభిమానులకు అసలు టీ20 మజా చూపించింది.



# నమీబియాపై గ్రాండ్ విక్టరీ

### సత్తా చాటిన కిషన్, చక్రవర్తి

**ఢిల్లీ:** టీ20 ప్రపంచకప్-2026 భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్-ఏ పోరులో టీమిండియా విజయాల పరంపర కొనసాగుతోంది. పసికూన నమీబియాపై భారత్ 93 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించి పాయింట్స్ టేబుల్ అగ్రస్థానంలో నిలించింది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ ఇషాన్ కిషన్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కిషన్ (61 పరుగులు, 24 బంతుల్లో), స్టేడియం నలుమూలల బౌండరీల వర్షం కురిపించాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా (52) అర్ధశతకంతో రాణించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు సాధించింది. నమీబియా బౌలర్లలో కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ 4 వికెట్ల అద్భుత స్పెల్‌తో భారత్‌ను మరిన్ని పరుగులు చేయకుండా కట్టడి చేశాడు.

### కుప్పకూలిన నమీబియా బ్యాటింగ్..

210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా జట్టు, భారత బౌలర్ల ధాటికి 116 పరుగులకు ఆలౌట్ అయింది. భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన మాయాజాలంతో 3 వికెట్లు తీసి నమీబియా వెన్ను విరిచాడు. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా 2 వికెట్లతో రాణించగా.. బుమ్రా ఒక వికెట్, పేసర్ అర్షదీప్ సింగ్ టీ20ల్లో తన 250వ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. దీంతో నమీబియా జట్టు 17.4 ఓవర్లలో 117 పరుగులకే కుప్పకూలింది.





# మీనాక్షి చౌదరి మెస్మరైజ్

సాంప్రదాయంఉస్టైల్ కలయికలో మరోసారి మెరిసింది మీనాక్షి చౌదరి. తాజాగా ఎమరాల్డ్ గ్రీన్ చీరలో ఆమె అందం మరింత తళుక్కుమంది. గాఢమైన ఆకుపచ్చ రంగు చీర ఆమెకు రాయల్ లుక్‌ను తీసుకొచ్చింది. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌పై చేసిన నాజూకైన ఎంబ్రాయిడరీ, స్వల్ప శిమ్మర్ డిజైన్ సంప్రదాయ దుస్తులకు ఆధునిక టచ్ ఇచ్చాయి. సింపుల్‌గా కనిపించినా స్టైలిష్‌గా మెరిసే ఈ కాంబినేషన్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించింది. గోల్డ్ జుమ్కాలతో లుక్‌ను పూర్తి చేసింది. ఆభరణాలు ఎక్కువగా కాకుండా, సరైన మోతాదులో ఉండటం వల్ల ఆమె ఎలిగెన్స్ మరింత హైలైట్ అయింది. స్లీక్ ఓపెన్ హెయిర్ స్టైల్‌తో గ్రేస్, గ్లామర్ రెండింటినీ సమతూకంగా మేళవించింది. మొత్తానికి, సంప్రదాయ చీరలో మోడ్రన్ వైబ్ చూపిస్తూ మీనాక్షి మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. ఈ లుక్ సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తోంది.



# విజయ్ దేవరకొండ పెళ్లి

## ఓటిటి హక్కులు తిరస్కరించిన రౌడీబాయ్

టాలీవుడ్ మోస్ట్ క్రేజీ నటులుగా పేరు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్తలు గత కొద్దిరోజులుగా ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వీరి పెళ్లి వీడియో స్ట్రీమింగ్ హక్కుల కోసం ఒక ప్రముఖ అంతర్జాతీయ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఈ ఆఫర్‌ను విజయ్ దేవరకొండ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. గతంలో నయనతార ? విఘ్నేష్ శివన్ వివాహ వీడియో స్ట్రీమింగ్ విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలు, డాక్యుమెంటరీ విడుదల కావడానికి పట్టిన సమయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ జంట అప్రమత్తమైనట్లు కనిపిస్తోంది. అలాగే తన వ్యక్తిగత జీవితంలోని అత్యంత ముఖ్యమైన వేడుకను వ్యాపారం చేయడం విజయ్‌కి ఇష్టం లేదని, అందుకే ఎన్ని కోట్లు ఆఫర్ చేసినా అంగీకరించలేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. తమ పెళ్లిని కేవలం కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య అత్యంత ప్రైవేట్‌గా జరుపుకోవాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం, ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో వీరి వివాహం జరగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయని నెట్టింట కొన్ని వీడియోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లోనే వీరిద్దరికీ నిశ్చితార్థం పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, ఈ జంట మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఏదేమైనా, తమ అభిమాన నటీనటులు ఒకటవుతుండటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# జగతి మేడం అందాలు చూడతరమా?



కన్నడ , తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన నటి జ్యోతి పూర్వాజ్ (జ్యోతి రాయ్) ప్రస్తుతం కెరీర్ పరంగా బిజీగా ఉన్నారు. పంజాబీ మూలాలున్నప్పటికీ, దక్షిణాది బుల్లితెరపై ఆమె అగ్ర నటిగా ఎదిగారు. కన్నడలో 'కిన్నరి', 'జోగుల' వంటి సీరియల్స్ ద్వారా గుర్తింపు పొందిన జ్యోతి, తెలుగులో 'గుప్పెడంత మనసు' సీరియల్‌లో జగతి పాత్రతో ఇంటింటికీ పరిచయమయ్యారు. ప్రస్తుతం ఆమె తన రూటు మార్చి యాక్షన్ సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. మల్టీలింగ్వల్ సూపర్ హీరో మూవీ 'మాస్టర్ పీస్' మరియు థ్రిల్లర్ మూవీ 'కిల్లర్' (డ్రీమ్ గర్ల్) వంటి విభిన్న చిత్రాల్లో నటిస్తున్నారు



# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు

టాలీవుడ్ యువ నటులు అన్ష్, వాసవి గణెళిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియెస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు. హీరో అన్ష్ తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెళిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ష్, వాసవి గణెళిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్-అర్జున్ సంగీతాన్ని అందించారు.



Printed, Published and Owned by SHAIK FAREED, and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: SHAIK FAREED. RNI NO : TGTEL/25/A1737 Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 9666052221

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
శుక్రవారం 13 ఫిబ్రవరి 2026

## ఉచిత వైద్య శిబిరం

**సన్‌రైజ్ హాస్పిటల్స్ వైద్య శిబిరం**

**చర్లపల్లిలో విశేష స్పందన**




**నేటి సాక్షి, ఎండపల్లి:** ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా సన్‌రైజ్ హాస్పిటల్స్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని చర్లపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నిపుణ వైద్యులు డా.రమణి బృందం పాల్గొని గ్రామస్తులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, హీమోగ్లోబిన్ తదితర ప్రాథమిక పరీక్షలతో పాటు సాధారణ వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు ఇతర అత్యవసర సమస్యలకు ఆరోగ్య శ్రీ సేవలు కూడా హాస్పిటల్ లో అందుబాటులో ఉన్నాయని వైద్యులు సూచనలు ఇచ్చారు. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు అందుబాటులో రావడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ పడిదం లావణ్య- మొగిలి మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యమే పంచాయతీ ప్రధాన ధ్యేయమని, సన్‌రైజ్ హాస్పిటల్స్ సేవా దృక్పథంతో ముందుకు వచ్చి శిబిరం నిర్వహించడంతో ప్రజల్లో ఆరోగ్య చైతన్యం మరింత పెరిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా మరిన్ని ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని ఆమె తెలిపారు. శిబిరం విజయవంతం కావడానికి కృషి చేసిన వైద్య బృందం కో ఆర్డినేటర్ రాజేందర్, సతీష్, మార్కెటింగ్ ఇంచార్జీ బాలు హాస్పిటల్ యాజమాన్యం, పి.ఎం.పి కొత్త అనంత చారి లకు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ రియాజ్, ఉప సర్పంచ్ అల్లం తిరుపతి, కార్యదర్శి తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు జెల్ల శ్రీనివాస్, సిగిరి శ్రేవిన్, మెరుగు రాజమ్మ నాయకులు శ్రీనివాస్, గంగాధర్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీలకు

**అనుమతి లేదు ఎస్పీ నితిక పంత్**



**నేటి సాక్షి - కొమరం భీమ్ ఆసిఫాబాద్:** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు, డీజేలు నిర్వహించడం, టపాకాయలు కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ నితిక పంత్ స్పష్టం చేశారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల కోసం పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వెలుపల 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక భద్రతా ఏర్పాట్లలో భాగంగా క్యూ.ఆర్.టి బృందాలు, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీములు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించే వారిపై రిమాండ్ సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించాలనుకుంటే సంబంధిత అధికారుల అనుమతి మేరకు, వారు సూచించిన తేదీల్లో మాత్రమే నిర్వహించాలని తెలిపారు. ప్రజలు శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ ఎన్నికల ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టులకు ఘన సన్మానం



**నేటి సాక్షి ,నారాయణపేట, రిపోర్టర్ ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అన్యువల్ డే పురస్కరించుకొని కళాశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఇమామ్ సాబ్, నారాయణపేట జిల్లా అక్షర కలం జిల్లా రిపోర్టర్ సయ్యద్ లకు గురువారం నాడు శాలువాలతో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మరికల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి నాగమణి మాల, వైస్ ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయ బృందం కళాశాల విద్యార్థులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

## తహసీల్దార్ సన్మానించిన

**లయన్స్ క్లబ్**



**నేటి సాక్షి మల్లాపూర్ :** మల్లాపూర్ మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్సై అనిల్, మరియు మండల వైద్యాధికారిణి వాహిని రావులను కనక సోమేశ్వర లయన్స్ క్లబ్ చైర్మన్ రేవెల్లి తిరుపతి ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వర్దినేని ప్రభాకర్ రావు, మంద స్వామి, ప్రేమ్, ఆకాశ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## అఖిలభారత సమ్మెకు మద్దతుగా చిలుకూరులో రాస్తారోకో




- ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే డా. సంజయ్-దీప్తి దంపతులు
- కోరుట్ల - మెట్‌పల్లి, ప్రజలకు ఓటింగ్‌కు పిలుపు

**నేటి సాక్షి - చిలుకూరు:** అఖిలభారత సార్వత్రిక సమ్మెకు మద్దతుగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చిలుకూరు కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను సవరిస్తూ కనీస వేతనాల నుంచి యాజమాన్యాలు తప్పించుకునే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరచడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన చట్టాలు, ఉపాధి హామీ పథకంపై తీసుకుంటున్న నిర్ణయాలను కూడా వారు వ్యతిరేకించారు. ప్రజా సమస్యలకు కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లుట్ల కనకయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడీల రాజు, సిపిఐ చిలుకూరు గ్రామ కార్యదర్శి చిలువేరు ఆంజనేయులు, సీనియర్ నాయకులు కస్తూరి సైదులు, కట్టెకోల నాగేశ్వరరావు, సుల్తాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై గజ్వేల్‌లో సిఐటియు ర్యాలీ




**నేటి సాక్షి - గజ్వేల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా గజ్వేల్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సంస్థల కార్మికులు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందెబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, జాతీయ ఉపాధి హామీ పథకంపై తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం




- ఐదు మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపుకు ఎస్.కె.ఎన్.ఆర్ డిగ్రీ కళాశాలలో కేంద్రం
- జగిత్యాల జిల్లా కలెక్టర్, ఎస్పీ సమీక్ష - పటిష్ట భద్రతా చర్యలు
- పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహణకు మార్గదర్శకాలు

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో, రాధారపు నర్సయ్య:** జగిత్యాల జిల్లాలో నిర్వహించిన రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపును జగిత్యాల ఎస్.కె.ఎన్.ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. కేంద్రంలో కౌంటింగ్ టేబుళ్ల అమరిక, సిబ్బంది కేటాయింపు, నియంత్రణ గదుల ఏర్పాటు వంటి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కలిసి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, ప్రతి టేబుల్ వద్ద నియమించిన సిబ్బంది బాధ్యతలను వివరించారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతను స్వయంగా తనిఖీ చేసి, ఈవీఎంల భద్రతా ప్రమాణాలను అధికారులు సమీక్షించారు. కౌంటింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థుల ఏజెంట్లకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫలితాల ప్రకటనలో ఆలస్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ రోజున శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు వెల్లడించారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర వైద్య, విద్యుత్, అగ్నిమాపక సేవలు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియను గౌరవించాలని అన్ని రాజకీయ పార్టీలను కలెక్టర్ కోరారు. ఎన్నికలను శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దుకు చెన్నూరులో నిరసన



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** చెన్నూర్ ఉద్యోగ,కార్మిక,రైతు సంఘాల దేశ వ్యాప్త సమ్మెలో బాగంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అధ్వర్యంలో చెన్నూరు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి బోడంకి చందు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు హాజరై మాట్లాడుతూ. గత 11 సంవత్సరాలుగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ,కార్మిక,ఉద్యోగ,రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నది. అంగన్వాడీ ఉద్యోగులకు స్థానిక సర్పంచి పర్యవేక్షణ ఎత్తివేయాలని, ఫ్రీ ప్రైమరీ అంగన్వాడీలోనే ఉంచాలని, అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం చట్టం అమలు చేయాలని, దేశ ప్రజలకు నష్టం చేసే విధంగా,కార్పొరేట్ సంస్థల యాజమానుల జేబులు నింపడానికి కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకు వచ్చిన లేబర్ కోడ్స్,గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు, జాతీయ విత్తన బిల్లు,విద్యుత్ సవరణ బిల్లులను వెంటనే రద్దు చేయలి.లేకుంటే బీజేపీ మోడీ ప్రభుత్వానికి పుట్టగతులుండావు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరాలు దాటినా కూడా కార్మికులు కనీస వేతనాలకు,ఉద్యోగ భద్రతను నోచుకోకపోవడం లేదు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంవల్ల గ్రామీణ పేదలు,వ్యవసాయ కార్మికుల జీవితల్లో వెలుగులు వస్తే బీజేపీ మోడీ నేడు ఉపాధి హామీ పనులను రద్దు చేసి పేదల కడుపులు మద్చే పని చేస్తున్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా జాతీయ విత్తన బిల్లును తీసుకువచ్చి విత్తన రంగాన్ని బహుళజాతి కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. విద్యుత్ సవరణ చట్టం ద్వారా స్మార్ట్ మీటర్లు అమలు చేసి ముందస్తుగా బిల్లులు వసూలు చేయడం, ఉచిత విద్యుత్‌ను భవిష్యత్తులో నిలిపివేసే పరిస్థితులు తీసుకురావడం జరుగుతోంది.విద్యుత్ బిల్లులను తెచ్చి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం, బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్ రంగాలను బహుళజాతి కంపెనీలకు అప్పగించడం అన్యాయం. ఉద్యోగ,కార్మిక హక్కుల పరిరక్షణ కోసం CITU నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఉమారాణి మహిళా సంఘం నాయకురాలు, సిఐటియూ నాయకులు కృష్ణమాచారి, పోతుల సరిత, యామిని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, లక్ష్మి, నాగమణి కల, రాణి, రాజ్యలక్ష్మి,, సుగుణ, మధు శ్రీ, భాగ్యలక్ష్మి, రమ్య, స్వరూప, విమల, గౌరమ్మ, పరమేశ్వరి, నాగమణి మధ్యాహ్నం భోజన కార్మికులు శంకరక్క తదితరులు పాల్గొన్నారు

# దేశవ్యాప్త సమ్మెతో మెట్‌పల్లిలో అంగన్వాడీల భారీ ర్యాలీ






## ● 4 లేబర్ కోడ్ల రద్దుకు డిమాండ్ - ఆర్డీఓకు వినతిపత్రం

**నేటి సాక్షి - మెట్ పల్లి, రాధారపు నర్సయ్య:** దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒకరోజు సమ్మెలో భాగంగా మెట్ పల్లిలో గురువారం అంగన్వాడీ టీచర్లు, ఆయాలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల అంగన్వాడీ సిబ్బంది వ్యవసాయ మార్కెట్ యార్డులో సమావేశమై తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. సమ్మె అనంతరం బస్సు డిపో నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నినాదాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సాయీశ్వరీ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ టీచర్లుగా గుర్తించి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని కోరారు. పదవీ విరమణ పొందిన వారికి రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆరోగ్యలక్ష్మి మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, పీఎఫ్, గ్రాట్యుటీ వర్తింపజేయాలని, అర్హులైన టీచర్లకు సూపర్వైజర్ పదోన్నతులు ఇవ్వాలని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు సుతారి రాములు, ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం దురదృష్టకరమన్నారు. సుప్రీంకోర్టు సూచించినట్లుగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి, కోరుట్ల, జగిత్యాల, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల అంగన్వాడీ టీచర్లు ఎం. భాగ్యలక్ష్మి,



దయావతి, శారద, వనిత, పద్మ, మమత, సునీత, హిమగిరి, షమీం సుల్తానా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మధ్యాహ్న భోజన, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు కూడా సమ్మెకు సంఘీభావం తెలిపారు.

# మెట్‌పల్లిలో వైస్ చైర్మన్ పదవి మాలలకు కేటాయించాలి



**నేటి సాక్షి - మెట్‌పల్లి, రాధారపు నర్సయ్య** మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని ఎస్సీ మాల వర్గానికి కేటాయించాలని మాల సంఘాల జేఏసీ జనరల్ సెక్రెటరీ బిట్లుగు కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, మున్సిపాలిటీలో మాలలకు న్యాయం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. మెట్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పాటు సమయంలో మాల సంఘాలు కీలక పాత్ర పోషించాయని ఆయన గుర్తుచేశారు. అప్పటి ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములకు వినతిపత్రం సమర్పించి మున్సిపాలిటీ ఏర్పాటు కోసం కృషి చేశామన్నారు. అయినప్పటికీ ఏర్పాటైన తర్వాత మాలలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 13వ, 16వ, 4వ వార్డులను ఎస్సీలకు కేటాయించిన నేపథ్యంలో వైస్ చైర్మన్ పదవిని మాల వర్గానికి ఇవ్వాలని కోరారు. మెట్‌పల్లి పట్టణంలో సుమారు 5,200 మంది మాల ఓటర్లు ఉన్నారని తెలిపారు. మాల వర్గానికి ప్రాతినిధ్యం కల్పించడం

## ● మాల సంఘాల జేఏసీ డిమాండ్ - ఏకగ్రీవ తీర్మానం

న్యాయసమ్మతమని పేర్కొన్నారు. ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, ఆదర్శనగర్, రేగుంట, ఆరపేట, వెంకట్రావుపేట ప్రాంతాల మాల సంఘాలు ఏకగ్రీవంగా సమావేశమై వైస్ చైర్మన్ పదవిని ఎస్సీ మాలకే కేటాయించాలని తీర్మానం చేశాయని వెల్లడించారు. మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ డిమాండ్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు కారం నరేష్, గుమ్మడి విక్రమ్, కారం కిషోర్, బక్కూరి మధు, మూగల శేఖర్, కరికి చిన్న గంగారం, దొంగేరీ నరేష్, రాసమొల్ల సురేష్, కావలి బాలకిషన్, మేకల వెంకట్, మేకల రాజేష్, బూరం సంజీవ్, సురేష్, మేకల ఉపేందర్, భూరం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

## ● ప్రిన్సిపల్ బి. నాగమణి మాల

**నేటి సాక్షి - నారాయణపేట్, ఇమామ్ సాబ్:** విద్యార్థులు చదువుల్లో కష్టపడి పేరు ప్రతిష్టలు సంపాదించి తల్లిదండ్రులకు, గ్రామానికి గౌరవం తీసుకురావాలని మరికల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి. నాగమణి మాల అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అంచెలంచెలుగా చదువుల్లో రాణిస్తూ స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. కష్టపడి చదివిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని తెలిపారు. గురుకుల పాఠశాలలో చదివే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించి



సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయులు సుమలత, రాధిక, మహేశ్వరి, శ్యామల, కవిత, బి. రాధిక, హాస్య, సుఖందా, కల్పన, గీతారాణి, శైలజ, ఆర్షయ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో ఓట్ల లెక్కింపుకు కట్టుదిట్టమైన బందోబస్తు





## ● 450 మంది పోలీసులతో మూడంచెల భద్రత - 163 BNSS అమలు

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో, రాధారపు నర్సయ్య:** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని 450 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు. లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎస్కెఎన్ఆర్ డిగ్రీ కాలేజీ వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా వ్యవస్థ అమలు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఎస్కెఎన్ఆర్ డిగ్రీ కాలేజీ పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు నిషేధిత వస్తువులు అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్ బాటిళ్లు, పేలుడు పదార్థాలు లెక్కింపు కేంద్రానికి తీసుకురావద్దని సూచించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా చట్టం-శాంతి భద్రతల దృష్ట్యా 163 BNSS (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిబంధనలు రేపు ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలు, టపాకాయలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులు కలిగిన అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బందిని మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. తనిఖీలు నిర్వహించే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రఘు చందర్, రాములు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# నాగులపేట యువతి అదృశ్యం

## ఆచూకీ తెలిపిన వారికి పారితోషికం



**నేటి సాక్షి - కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన నేముల లాస్య ప్రియా ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో కోరుట్ల బస్ స్టాండ్ నుంచి వెళ్లి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. లాస్య ప్రియా ఎక్కడైనా కనిపించినా లేదా ఆమెకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే 7981195177 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం అందజేస్తామని పేర్కొన్నారు.

# ఓట్ల లెక్కింపుకు పూర్తి ఏర్పాట్లు

## కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి, మంచిర్యాల:** ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో, బెల్లంపల్లి మున్సిపాలిటీకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బజార్ ఏరియాలో, చెన్నూర్ మున్సిపాలిటీకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఆర్.కె.సి.ఓ.ఎ క్లబ్‌లో, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి పాత ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132 మంది సహాయకులు, బెల్లంపల్లికి 19 మంది సూపర్వైజర్లు, 37 మంది సహాయకులు, చెన్నూర్‌కు 10 మంది సూపర్వైజర్లు, 20 మంది సహాయకులు, క్యాతనపల్లికి 24 మంది సూపర్వైజర్లు, 48 మంది సహాయకులు, లక్షెట్టిపేటకు 9 మంది సూపర్వైజర్లు, 18 మంది సహాయకులను రాండమైజేషన్ ద్వారా నియమించినట్లు వెల్లడించారు. బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో రెండు రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రతి రౌండ్‌కు వెయ్యి ఓట్ల చొప్పున రెండు రౌండ్లలో, మంచిర్యాల నగరపాలక సంస్థలో 60 టేబుల్స్ ఏర్పాటు చేసి ప్రతి రౌండ్‌కు వెయ్యి ఓట్ల చొప్పున లెక్కింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయుల గైర్హాజరు

## చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు మొగులయ్య డిమాండ్



**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం చర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ విధులకు ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే హాజరైనట్లు 7వ వార్డు సభ్యుడు మొగులయ్య తెలిపారు. ఈ విషయంపై పాఠశాలను సందర్శించిన ఆయన, ఒక్క ఉపాధ్యాయుడితోనే బోధన ఎలా జరుగుతోందని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల గైర్హాజరు సమస్యను గతంలోనే ధన్వాడ మండల ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా పై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు మొగులయ్య కోరారు. అవసరమైతే జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

# మృతుని కుటుంబానికి

## బియ్యం పంపిణీ, సర్పంచ్ మాధురి శ్రీనివాస్



**నేటి సాక్షి గన్నేరువరం, బుర్ర అంజయ్య గౌడ్ :** మండలంలోని మాదాపూర్ గ్రామనికి చెందిన పోతుగంటి బుచ్చయ్య ఇటీవల మృతి చెందగా మాదాపూర్ గ్రామ సర్పంచ్ మాధురి శ్రీనివాస్ గారు కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాదరి శ్రీనివాస్ గౌడుగు స్వామి నూనె చంద్రారెడ్డి మాడుగుల కర్ణాకర్ రెడ్డి గంగాధర మహేష్ సుంకరి రమేష్ పోతుగంటి సత్యనారాయణ ఆర్ఎంపి సంపత్ రాములు గౌడుగు చంద్రయ్య గోవింద్ సంతు అరుణ్ దమ్మగాళ్ల సురేష్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## అమ్మ కోరిక నెరవేర్చిన

### ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రారంభం



**నేటి సాక్షి - రాయికల్ ఇమ్మడి విజయ్ కుమార్:** రాయికల్ పట్టణంలోని శివాలయంలో గురువారం సదుల సంతోష్–సువర్ణ దంపతులు నిర్మించిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జున మొదటి జ్యోతిర్లింగాన్ని ఆవిష్కరించి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో చిరంజీవి, ఎస్సై సుదీర్ రావు, ఆర్ఐ దాసరి పద్మయ్యతో పాటు కుటుంబ సభ్యులు, భక్తులు మిగతా లింగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ, శివాలయ అభివృద్ధికి భక్తితో ఆర్థిక వనరులు సమకూర్చుతున్న శివసేవకుల సేవలు అభినందనీయమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకే చోట భక్తులకు దర్శనం కలిగేలా ఏర్పాటు చేయడం గొప్ప సేవగా అభివర్ణించారు. ఈ సందర్భంగా సదుల సంతోష్ మాట్లాడుతూ, గత మహాశివరాత్రి సందర్భంగా తన తల్లి సర్గీయ సదుల లక్ష్మీదేవి–మల్కయ్య శివాలయంలో ఏదైనా సేవ చేయాలని కోరిందని, ఆమె మరణానంతరం ఆ కోరికను నెరవేర్చేందుకు ద్వాదశ జ్యోతిర్లింగాలను నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదుల సాహితీ, దాసరి విద్యాసాగర్, రచన, ఆశోక్, రాజ్యలక్ష్మి, అందే సురేష్, నీలిమా, గోల్డ్ గ్రూప్ సభ్యులు, శివసేవకులు ఎనగందుల రమేష్, కడకుంట్ల జగదీశ్వర్, దాసరి గంగాధర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడే పురపాలక ఫలితాలు



**నేటి సాక్షి - రాయికల్ ఇమ్మడి విజయ్ కుమార్ :** రాయికల్ పట్టణంలో పురపాలక సంఘం ఎన్నికల ఫలితాలు నేడు ఓట్ల లెక్కింపు తో విడుదల కానున్నాయి. రాయికల్ మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమదే గెలుపు అంటూ ఎవరికి వారు చెప్పుకుంటున్నారు. నేటికి ఎన్నికల ఫలితాలతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గెలిచిన అభ్యర్థులు మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని అలాగే ఓడినఅభ్యర్థులు ప్రతిపక్షంగా ఉంటూ సమస్యలపై పోరాటం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థి సహకారం

### 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**నేటి సాక్షి - చౌడేపల్లి:** చౌడేపల్లి మండలం మేకల చిన్నేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎస్టియు చౌడేపల్లి మండలశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. రాష్ట్ర నిపుణులు ప్రత్యేకంగా తయారు చేసిన ఈ స్టడీ మెటీరియల్‌ను పాఠశాల పూర్వ విద్యార్థి బి. సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు ఎస్టియు శాఖ తరఫున సుబ్రహ్మణ్యంకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లింగమూర్తి యాదవ్, ఉపాధ్యక్షులు మోహన్, రాష్ట్ర కౌన్సిలర్ రామకృష్ణతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీలకు

### అనుమతి లేదు. సి.ఐ బన్సీలాల్



**నేటి సాక్షి - చెన్నూర్:** చెన్నూర్ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఫిబ్రవరి 13న చెన్నూర్ పట్టణంలో 163 బీఎన్ఎస్ఎస్(144సెక్షన్) అమలులో ఉంటుందని సి.ఐ బన్సీలాల్ తెలిపారు. కౌంటింగ్ సెంటర్‌గా ఉన్న జడ్పిహెచ్ఎస్ పాఠశాల వద్ద ప్రజలు గుమిగూడటం, కేకలు వేయడం వంటి చర్యలు నిషేధించబడ్డాయని చెప్పారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ సెంటర్‌లోకి అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, సెల్‌ఫోన్లు అనుమతించబడవని తెలిపారు. పట్టణంలో విజయోత్సవ ర్యాలీలు, డీజే సౌండ్లు, టపాకాయలు పేల్చడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 16 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్నందున నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉన్నందున ఇద్దరికిపైగా గుమిగూడకూడదని, శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజలు సహకరించాలని సి.ఐ బన్సీలాల్ కోరారు.

# ఓసిల మహా ధర్నాకు మద్దతివ్వండి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి కి ఆహ్వాన పత్రం అందించిన పోలాడి రామారావు



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్, పూరెళ్ల బాపు:** ఓసిల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 23 న డిల్లీలో జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు . ఈ మేరకు డిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నాకు మద్దతు తెలపాలని గురువారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ని ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు కోరుతూ జగిత్యాల లో ఆహ్వాన పత్రం అందజేశారు. అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుక బడి ఉన్నవారు రిజర్వేషన్లు లేమి కారణంగా అటు సంక్షేమ పథకాల ఫలాలు ఇటు రాజకీయ పదవులు పొందలేక పోతున్నారని అన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలతో మున్సిపల్ వార్డు రిజర్వేషన్లలో ఓసి లకు తీవ్ర అన్యాయం జరిగి అవకాశాలు కోల్పోయారని మండిపడ్డారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పై రాజకీయ పబ్బం కోసం కొందరు ఆయా కులాల్లోని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిరుపేద ఓసి లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జనరల్ స్థానాల్లో సైతం ఓసిలు తట్టుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. హన్మకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీలో 16డివిజన్లు జనరల్ కేటగిరీకి రిజర్వు కాగా 12చోట్ల ఓసి లు పోటీ చేయలేక పోయారన్నారు. జనరల్ స్థానాల్లో కూడా ఓసి లకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వక పోవడం వల్ల రాజకీయంగానూ వెనుక బడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి చేయూతనిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పిస్తే వాటిపైనా దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేసేందుకు జాతీయ ఈడబ్ల్యూఎస్ కమిషన్ను ఏర్పాటు చేయాలని రామారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓసి జేఏసీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్న పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్‌తో వికారాబాద్‌లో భారీ ర్యాలీ

**నేటి సాక్షి - వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఎం, సిపిఐ, బీఆర్టీయూ, ఎస్ఎఫ్ఐ తదితర అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్. మహిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీ లైబ్రరీ నుంచి మార్కెట్ యార్డ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు పేదల జీవనోపాధిపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సవరణ చట్టం ద్వారా స్మార్ట్ మీటర్లు అమలు చేసి ఉచిత విద్యుత్‌ను నిలిపివేసే పరిస్థితులు తీసుకువస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో విదేశీ పెట్టుబడులను పెంచడం,




బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేటీకరించడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి మహేందర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అనసూయ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ సహా అంగన్వాడీ, ఆశ, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు




**నేటి సాక్షి - రాయికల్:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా గురువారం రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులకు గ్రామస్తులు గుస్సాడి వేషధారణతో, డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అవగాహన సందేశాలతో టీషర్టులు, టోపీలు ధరించి గ్రామంలో వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్బీఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రధాన అంశం "కేవైసీ – సురక్షిత బ్యాంకింగ్‌కు తొలి అడుగు" అని తెలిపారు. ప్రజల్లో సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై అవగాహన పెంపొందించడం, కేవైసీ వివరాల నవీకరణ, సైబర్ భద్రతపై జాగ్రత్తలు పాటించడం ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రతి ఖాతాదారుడు తన కేవైసీ వివరాలను నవీకరించుకోవాలని, ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డులు వంటి గోప్య సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రీజనల్ హెడ్ అరుణ సవిత మాట్లాడుతూ గ్రామ సభలు, అవగాహన కార్యక్రమాలు, వినియోగదారుల సమావేశాలు నిర్వహించి సురక్షిత డిజిటల్ బ్యాంకింగ్, పొదుపు అలవాట్లు, బాధ్యతాయుత ఆర్థిక ప్రణాళికపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆర్బీఐ ఎల్డీఓ యశ్వంత్ సాయి ప్రజలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్, టీజీబీ ఆర్ఎం రాజనరేంద్ర, ఎమ్మార్వో నాగార్జున, ఎంపివో సుష్మా, యూబీఐ, ఎస్‌బీఐ శాఖల మేనేజర్లు, ఎఫ్ఎల్‌సీ ప్రతినిధులు, సర్పంచ్ శంకర్, ఉపసర్పంచ్ మల్లయ్య, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గన్నేరువరం మండలంలో కార్మిక సంఘాల నిరసన

**నేటి సాక్షి, గన్నేరువరం, బుర్ర అంజయ్య గౌడ్:** గన్నేరువరం మండలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని అంగన్వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ ఆశా కార్యకర్తలు ఈరోజు గన్నేరువరం మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మండల తాసిల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ అంగనవాడి టీచర్స్ లేబర్ హెల్పర్స్ ఆశాకార్యకర్తలకు కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా కార్యకర్తలకు ఫిక్స్ డిపాజిటివ్ విధానం చెల్లించాలని అంగన్వాడీ టీచర్లకు అదనపు పనులురద్దు చేయాలని అర్హులైన టీచర్లకు ప్రమోషన్ ఇవ్వాలని ఆశా వర్కర్లకు కేంద్రం పెంచిన జీతాలను అమలు చేయాలని అంగన్వాడీ టీచర్లకు అమలుకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రెండు లక్షల ఆయాలకు లక్ష రూపాయలు అమలు పరచాలి అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చో క్కల శ్రీశైలం జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాంతల అంజిరెడ్డి అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు ముంజా రజిత ప్రధాన కార్యదర్శి పులి శారద ఆశా కార్యకర్తల అధ్యక్షులు సంపత్ లావణ్య కార్యదర్శి



విజయలక్ష్మి అఖిల భారత విద్యార్థి సమాఖ్య మండల కార్యదర్శి ములకల పవన్ గన్నవరం గ్రామ కార్యదర్శి అంజయ్య చారి ఎండి నయుం అధిక సంఖ్యలో సంఘాల సభ్యులు పాల్గొన్నారు

# పారదర్శకంగా ఓట్ల లెక్కింపు కోస్గి, మద్దూరు కేంద్రాల పరిశీలన



**నేటి సాక్షి - నారాయణపేట:** మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు ఆదేశించారు. గురువారం కోస్గి పట్టణంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల భద్రత, నిల్వ విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులు భద్రపరిచినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. అనంతరం మున్సిపల్ ఓట్ల లెక్కింపు విధానాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, కౌంటింగ్ అధికారులకు కీలక సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో అభ్యర్థులు, ఏజెంట్లకు స్పష్టంగా చూపిస్తూ చెల్లుబాటు అయ్యే, చెల్లుబాటు కాని ఓట్లను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి ఒకసారి చెల్లుబాటు కాని ఓటుగా నిర్ణయించిన ఓటును మళ్లీ పరిగణలోకి తీసుకోరాదని తెలిపారు. రీకౌంటింగ్‌పై నిర్ణయం లిఖితపూర్వక అభ్యర్థన ఆధారంగానే తీసుకోవాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రతి వార్డుకు ఒక్కో ఏజెంట్‌కే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అధికారులు హాజరై, 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే మద్దూరు మున్సిపాలిటీ కౌంటింగ్ కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 8 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. కేంద్రంలో సెల్ ఫోన్లకు అనుమతి లేదని, బయటే జమ చేయాలని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులకు రాత్రి బస ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈర్లపల్లి పాఠశాలలో క్రీడా సంబరం



- నూతన ప్లే గేమ్స్ ప్రారంభం

**నేటి సాక్షి, చేవెళ్ల, సుధాకర్ గౌడ్ :** చేవెళ్ల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురువారం పండుగ వాతావరణం నెలకొంది. 17000 ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన నూతన క్రీడా పరికరాలను గ్రామ సర్పంచ్ లావణ్య రాజశేఖర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్లే గేమ్స్ అందుబాటులోకి రావడంతో విద్యార్థుల కేరింతలతో పాఠశాల ప్రాంగణం మారుమోగింది. సర్పంచ్ లావణ్య ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య రాజశేఖర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల క్రీడా వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, పాఠశాల అభివృద్ధికి సహకరించిన 17000 ఫౌండేషన్ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం కరుణాకర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా పరికరాల కొరతతో ఇబ్బంది పడుతున్న తరుణంలో ఫౌండేషన్ వారు స్పందించి ఈ వసతులు కల్పించడం శుభపరిణామన్నారు. క్రీడల ద్వారా పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెరుగుతాయని, తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. ఉత్సాహంగా సాగిన కార్యక్రమం ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కులగల దయాకర్, వార్డు సభ్యులు రాఘవేందర్, అనూష, శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు సంకల్పించారు. కార్యక్రమం ముగింపులో ఫౌండేషన్ ప్రతినిధులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి

- కౌంటింగ్ పై అధికారులకు మాక్ కౌంటింగ్ రిహార్సల్...
- లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన : సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, డిఎస్పీ రాజశేఖర్ రాజు





**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మున్సిపల్ ఎన్నికల లెక్కింపుకు పటిష్టంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. గురువారం అవంతిపురం మార్కెట్ యార్డులో మున్సిపల్ ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల లెక్కింపు పై మాక్ కౌంటింగ్ రిహార్సల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కౌంటింగ్ సూపర్వైజర్లు మరియు కౌంటింగ్ అసిస్టెంట్లకు కౌంటింగ్ ప్రక్రియపై వివరంగా అవగాహన కల్పించారు. ఇందులో పోస్టల్ బ్యాలెట్ కవర్లను వార్డు వారీగా వర్గీకరించడం, పోస్టల్ బ్యాలెట్ల వివరమైన లెక్కింపు, చెక్ మెమోల పరిశీలన, స్ట్రాంగ్ రూమ్ నుండి కౌంటింగ్ టేబుళ్లకు బ్యాలెట్ బాక్సుల తరలింపు, ప్రారంభ కౌంటింగ్ కేటాయింపు మరియు అంగీకారాలు (I II III), వివరణాత్మక కౌంటింగ్ షీట్ల తయారీ, సర్టిఫికేట్ I&II జారీ వంటి సూచనలు ఇచ్చారు. ఫలితాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ టౌన్ సి.ఐలు, పోలీస్ బృందం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రాస్తారోకో స్తంభించిన వాహనాలు





**నేటి సాక్షి, తిరుమలాయపాలెంమెట్టు రుద్రరాజు:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల హక్కులను కాల రాస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలకు నిరసనగా భారీ రాస్తారోకో జరిగింది ఈ నిరసన ప్రదర్శనలో అసంఘటిత కార్మికులు భవన నిర్మాణ కార్మికులు అంగన్వాడీలు ఆశ వర్కర్లు మధ్యాహ్న భోజన కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు స్కీమ్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావం తెలియజేశారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొమ్ము శ్రీను సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు వశపంగు వీరన్న మాట్లాడుతూ దశాబ్దాల కాలమును నుండి 29 కార్మిక చట్టాలను సాధించుకొని ఎనిమిది గంటల పని విధానాన్ని అమలుపరచుకొని కార్మిక హక్కులను కాపాడుకుంటున్నారు దీనికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం లో ఉన్న బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుంది కార్మికులను కట్టు బానిసలుగా చేస్తా ఉంది కనీస వేతనం 26 వేల రూపాయలు ప్రభుత్వం సెక్టర్లో పనిచేసే వారికి ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా గాని వాటిని అమలు పరచకుండా కార్మికులు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల నోట్ల మన్నుకొట్టే ప్రయత్నం చేస్తుంది ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయకుంటే భవిష్యత్తులో కార్మికులందరికీ కూడాగట్టి భారీ ఎత్తున కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు రాస్తారోకోలు జరుపుతామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు జనక శ్వేత, నాగమల్లేశ్వరి, మంజుల, సుహాసిని, బేబీ, నెల్లుట్ల పుష్ప, గాయత్రి ,పద్మ, మోటమర్రి నాగేంద్ర, గురపాటి లత, దోమల సత్యవతి, మమత, జనక పోలమ్మ, తిమ్మిడి సైదమ్మ, లక్ష్మి, జిల్లా ఉప్పలయ్య, శ్రీను, గురవయ్య, రామ్మూర్తి ,సుంచు ఉపేంద్ర పద్మ ఉప్పమ్మ భాగ్యమ్మ కోడి లింగయ్య పట్ల అంజయ్య గట్టిగుండ్ల మల్సూర్ ఎస్కే మల్సూర్ మాణిక్యరావు రాము క్రాంతి కుమార్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నిరుసుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన విద్య

**సంఘంలో రాణిస్తుంది వీడ్కోలు సమావేశం**





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** క్రమశిక్షణతో కూడిన విద్య సంఘంలో రాణిస్తుందని చౌడేపల్లి మాజీ సర్పంచ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలదాత గాజుల పద్మావతమ్మ, అన్నారు గురువారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో వార్షికోత్సవము ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా గాజుల పద్మావతమ్మ ప్రసంగిస్తూ చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడే అనుకున్నది .సాధిస్తారు అన్నారు నిరుపేద మధ్యతరగతి కుటుంబానేమధ్యంలో పెరుగుతున్న విద్యార్థులు చదువును ఆయుధంగా చేసుకుని చక్కగా రాణించాలన్నారు .చదువుతూనే కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు చెడు మార్గంలో వెళ్లకుండా సమాజానికి మేలు చేకూర్చే విధంగా నడుచుకోవాలన్నారు. అనంతరం స్థలదాత గాజుల పద్మావతమ్మను ఆధ్యాపక బృందం విద్యార్థులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయప్రకాష్ .అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

# ఓట్ల లెక్కింపుకు భద్రతా ఏర్పాట్లు



**నేటి సాక్షి - వికారాబాద్:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు జిల్లాలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీటీవీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం, డీజే సౌండ్ సిస్టమ్ వినియోగం పూర్తిగా నిషేధించబడినట్లు తెలిపారు. అలాగే నిర్దిష్ట పరిధిలో సెక్షన్ 144 అమలులో ఉంటుందని, ఐదుగురికి మించి గుమికూడడం, నినాదాలు చేయడం నిషేధమని స్పష్టం చేశారు. జిల్లాలోని సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలు మోహరించగా, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ స్నేహ మెహ్రా కోరారు.

# మరకత శివలింగానికి పూజలు

**నటుడు రాజేంద్రప్రసాద్**



**నేటి సాక్షి - శంకర్‌పల్లి:** మరకత శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి ఆహ్వానం మేరకు ప్రముఖ సినీ నటుడు, నటకిరీటి పద్మశ్రీ రాజేంద్రప్రసాద్ గురువారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామంలో వెలసిన మరకత శివలింగాన్ని దర్శించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ పునర్నిర్మాణ దాత వెంకటేశ్వరరావు (వీడియో రావు), దేవాలయ చైర్మన్ గోపాల్ రెడ్డి రాజేంద్రప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఆకుపచ్చ శివలింగానికి పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. పచ్చటి పొలాల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ఈ దేవాలయం భక్తులకు ప్రత్యేక అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. పూజ అనంతరం దేవాలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో సత్కరించి మరకత శివలింగం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ వైస్ చైర్మన్ శేఖర్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, డబ్బింగ్ ఆర్టిస్ట్ కృష్ణవేణి, గ్రామ సర్పంచ్ మల్లేశం, ఉపసర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు సాయి శివ, అర్చకులు సాయి, కమిటీ సభ్యులు గోపాల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# లింగాలలో శివ స్వాముల భిక్ష

**పండ్లు పంపిణీ చేసిన సమాజ సేవకుడు నవీన్ కుమార్ గౌడ్**



**నేటి సాక్షి పాములపాడు:** పాములపాడు మండలంలోని, లింగాల గ్రామంలో శివ స్వాములు జ్యోతిర్ముడి కట్టుకొని, శివాలయం దగ్గర భిక్ష ఏర్పాటు చేసి వచ్చిన భక్తాదులకు భక్ష భోజనం వడ్డించారు. ఈ సందర్భముగా సోషల్ వర్కర్ నవీన్ కుమార్‌గౌడ్ కూడా శివ స్వాములకు వచ్చిన భక్తాదులకు అరటి పండ్లు పంచడం జరిగిందన్నారు. ఈ శివస్వాముల పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఎంతో సంతోషంగా ఉందని నవీన్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల శివ స్వాములు, వారిబంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737



## బాధిత కుటుంబాన్ని

పరామర్శించిన జీవన్ రెడ్డి



**నేటి సాక్షి మల్లాపూర్:** మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన వంగ అశోక్ తండ్రి వంగ రైపల్ మరణించగా, గురువారం మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. రైపల్ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, ఉప సర్పంచ్ పోతయ్య, విడిసి చైర్మన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

సర్పంచ్ రజిత



**నేటి సాక్షి జగదేవపూర్:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, తిగుల్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ కుడుదుల రజిత పరశురాం తెలిపారు. గురువారం తిగుల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడతామని, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాబోయే మహాశివరాత్రి పండుగ సందర్భంగా గ్రామంలో జాతర ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కార్యదర్శి నరేందర్, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పనులు పరిశీలించిన ఎంపిడిఓ



**నేటి సాక్షి - మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలం వేంపేట్ గ్రామంలోని రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను బ్లేడ్ ట్రాక్టర్‌తో తీసివేయించి చదును చేయించడం జరిగింది. అలాగే రోడ్డు ప్రక్కన చాలా లోతుగా ఉన్న ప్రాంతంలో వాహనాలు స్కిడ్ కాకుండా ఉండటానికి మొరం పోయించడం. తదితర అభివృద్ధి పనులు పరిశీలించడానికి మెట్‌పల్లి ఎంపీడీఓ సురేష్ రావడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు మెంబర్ గోరుమంతుల రఘు ఉన్నారు

## ఆంగ్ల భాషా దినోత్సవం



**నేటి సాక్షి - రాయికల్ ఇమ్మడి విజయ్ కుమార్ :** రాయికల్ మండలం మైతాపూర్ ఉన్నత పాఠశాలలో సరోజినినాయుడు జన్మదినం పురస్కరించుకొని ఆంగ్ల భాష దినోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరోజినినాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు కొండూరి రజనీకాంత్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముక్కాల మోహన్ రెడ్డి, వేముల మధు, కల్వకోట కార్తీక్, వేముగంటి గిరిధర్, అంతడుపుల గంగారాజం, సిద్దె గంగారాజం, రాపర్తి నర్సయ్య లు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల లెక్కింపునకు సర్వం సిద్ధం





- కలెక్టర్ ప్రతీక్ జైన్

**నేటి సాక్షి వికారాబాద్.:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 7 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి. సిసి కెమెరాల నిఘాలో లెక్కింపు జరుగుతుంది. మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు. గుర్తింపు కార్డు ఉన్న వారికే ప్రవేశం ఉంటుంది. ప్రతి రౌండ్ పూర్తయిన తర్వాత అభ్యర్థుల ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలి. పరిశీలకుల అనుమతితోనే విజేతలను ప్రకటించాలి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల వద్ద డీఎస్పీల పర్యవేక్షణలో స్పెషల్ ఫోర్స్ తో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్ ఎత్తివేయాలి

- భారతీయ గోర్ బంజారా పోరాట సమితి



**నేటి సాక్షి శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ప్రతినిధులు గురువారం జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికై మూడు నెలలు కూడా కాకముందే, పరిపాలనా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఇవ్వకుండా సస్పెండ్ చేయడం గిరిజన మహిళా ప్రజాప్రతినిధిని అవమానించడమేనని ఖండించారు. కేంద్ర, రాష్ట్ర నిధుల వినియోగంపై సరైన విచారణ జరపకుండానే ఈ చర్య తీసుకోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో న్యాయం జరగకపోతే ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రితో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ మరియు మానవ హక్కుల సంఘాన్ని కూడా ఆశ్రయిస్తామని సమితి ప్రతినిధులు హెచ్చరించారు.

కలెక్టర్ గారు ఈ విషయాన్ని పునఃపరిశీలించి, న్యాయమైన విచారణ జరిపి సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బైండ్ల సంఘం భవనాన్ని ప్రారంభించిన అక్కం స్వామి



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** తొగుట మండలంలోని ఘనపురం గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దయతో బైండ్ల సంఘం నాయకుల సహకారం తో సంఘం భవనానికి స్థలాన్ని కొనుగోలు చేసి భవనాన్ని నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవనానికి బైండ్ల రాజయ్య,బైండ్ల బుచ్చిరాజు, బైండ్ల నర్సింలు,బైండ్ల యాదగిరి,బైండ్ల పరశురాములు,మరియు బైండ్ల రామస్వామి ల సహకారం తో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. బైండ్ల సంఘం భవన నిర్మాణానికి సహకరించిన దాతలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బైండ్ల సంఘానికి టెంటు సామాగ్రిని అందజేయడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజులలో తన వంతు సహాయ సౌకర్యాలు మరిన్ని అందజేస్తానని వారికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రారంభానికి వచ్చిన అతిథులను శాలువాతో సన్మానించారు. తెలంగాణ బైండ్ల సంఘం కోశాధికారి అన్నిమల్ల రవీందర్ బైండ్ల మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా మండల మరియు గ్రామ ప్రజలపై ఉండాలని,పాడి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వాలు తమను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి తమ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో మరుపల్లి పరుషరాములుగౌడ్,రాజాగౌడ్ మరియు గ్రామప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు




**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మండల పరిధిలోని యాద్గార్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం "స్వపరిపాలన దినోత్సవం" వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ప్రధానోపాధ్యాయులు గా మరియు ఉపాధ్యాయులుగా చక్కని వేషధారణతో పాటు, తరగతి గదిలో వివిధ రకాల టిఎల్ఎంల సహాయంతో చక్కని బోధన & పాఠశాల పర్యవేక్షణను చాలా బాగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ.బాలు నాయక్ అందరికీ స్వపరిపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నిజ జీవితంలో కూడా విద్యార్థులు తాము పోషించిన పాత్రలను భవిష్యత్తులో సాకారము చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ స్వపరిపాలన దినోత్సవంలో భాగంగా ప్రధానోపాధ్యాయులుగా నవీన్ కుమార్, ముఖ్యమంత్రి గా గణేష్, విద్యాశాఖ మంత్రిగా సాయి కుమార్, జడ్పి చైర్మన్ గా అక్షిత శ్రీ, కలెక్టర్ గా అక్షిత, జాయింట్ కలెక్టర్ గా వైష్ణవి, జిల్లా విద్యాశాఖ అధికారిగా మనీషా, ఆర్డీఓ గా అపర్ణ, తహశీల్దార్ గా ఐశ్వర్య, ఎంఈఓ గా రేణుక వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ బృందం వెంకటయ్య, వెంకట మహేశ్వర్, విజయ, సైదా చారి, శ్రీశైలం, జాకీర్ హుస్సేన్, శేఖర్ రెడ్డి, ప్రశాంతి, రాము, వెంకట రత్నంలు విద్యార్థినీ, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# కార్మిక వ్యతిరేక 'లేబర్ కోడ్లను' రద్దు చేయాలి




- సిఐటియు డిమాండ్

**నేటి సాక్షి తొగుట వడ్డే నరసింహులు:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సిఐటియు (జ×ఖ) ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి జి. భాస్కర్ పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు కొమ్ముకాసేలా తెచ్చిన 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలి. విద్యుత్ సవరణ చట్టం-2025, విబి జి-రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లులను రద్దు చేయాలని, ఎల్ఐసీలో 100% విదేశీ పెట్టుబడుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టాల వల్ల కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా పోతుందని, 'హైర్ అండ్ ఫైర్' పద్ధతితో ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి జాబితాలో ఉన్న కార్మిక చట్టాలను రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రం మార్చడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ, మండల కన్వీనర్ వసంత, శ్యామల, స్వప్న, నర్సింలు, మల్లేశం, శ్రీనివాస్ మరియు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# మల్లాపూర్ గురుకులంలో ఘనంగా వార్షికోత్సవం




- పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలి
- కాళేశ్వరం జోన్ అధికారి సిహెచ్ గిరిజ

**నేటి సాక్షి, ధర్మార :** మండలంలోని మల్లాపూర్ గురుకుల పాఠశాల & కళాశాలలో గురువారం ఘనంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ అరుణ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాళేశ్వరం జోన్ అధికారి సిహెచ్ గిరిజ, డిసిఓ శ్రీనివాస్ హాజరై పాఠశాలలోని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు, గానం, నవ్వుల క్షణాలు గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులు తోటి వారి సమక్షంలో భావోద్వేగాపూరితమైన వీడ్కోలు ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు జ్ఞాపకాలను గుర్తుచేస్తూ వారి భవిష్యత్తు విజయం కోసం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోనల్ అధికారి సిహెచ్ గిరిజ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఈ ఏడు పది,ఇంటర్లో 100% గ్రేడ్ తెచ్చుకొని పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు. పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో సూచనలు చేశారు. విద్యార్థులు విద్యతో పాటు విలువలు నేర్పించిన ఉపాధ్యాయులకు ఎల్లవేళలా కృతజ్ఞతగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు చదువులు మాత్రమే కాకుండా సంస్కారాన్ని కూడా అలవర్చుకొని తోటి వారికి సహాపకారిగా ఉండటానికి ప్రయత్నించాలన్నారు. ఈ ఏడు వీడ్కోలు తీసుకుంటున్న విద్యార్థులకు ఇది ముగింపు కాదు కొత్త అధ్యాయనం ప్రారంభించాలని కోరారు. మల్లాపూర్ గురుకుల పాఠశాల 2025-26 గాను పీఎం శ్రీ లో రాష్ట్రస్థాయిలో ఎంపికవడం జరిగిందని ప్రిన్సిపల్ అరుణ తెలిపారు. వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ లు అనూష, వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ మోషన్ అలీ, పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ సుంచు మల్లేశం, ఉపాధ్యాయులు శ్రీలత, శ్వేత, రుసేంద్రమని, హేమ, విజయలక్ష్మి, అతియా ఫాతిమా, స్రవంతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ మిత్రులకు ఘనంగా సన్మానం

**నేటి సాక్షి, జగిత్యాల గుండ ప్రశాంత్ గౌడ్:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడుని తోటి మిత్రుడు చిల్వకోడూరు సర్పంచ్ దాసరి తిరుపతి.విశ్వబ్రాహ్మణ గొల్లపెల్లి పట్టణ అధ్యక్షుడు గణేష్ పూర్వ విద్యార్థులు. సేవా కార్యక్రమాలను గుర్తించి. సన్మానించారు.శుక్రవారం చిల్వకోడూరు రామాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు దాసరి తిరుపతి.గొల్లపెల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు గణేష్.శాలువాతో సన్మానం చేసి.ఆనందం వ్యక్తం చేశారు.తమ మిత్రుడు సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కావడం.విశ్వబ్రాహ్మణ పట్టణ అధ్యక్షులు కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపల్లి హనుమాన్లు.బరిగల భూమయ్య,అల్లాడి గోపి, పప్పుల వెంకన్న,సిహెచ్ మహేష్,పల్లెర్ల రాజేందర్,నల్ల తిరుమల్ రెడ్డి,మారం పెల్లి బాబు,ఆది మల్ రెడ్డి, ఓరగంటి పోచయ్య, కొమరన్న, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



# గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో హోరాహోరీ పోరు



- మున్సిపల్ పీఠం ఎవరికి? ఉత్కంఠగా మారిన రాజకీయ సమరం

**నేటి సాక్షి గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఎన్నికల వాతావరణం ఉత్కంఠభరితంగా మారింది. మొత్తం 20 వార్డులు కలిగిన ఈ మున్సిపాలిటీలో గత 15 రోజులుగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేశారు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మద్యం, మాంసం, బహుమతులు పంపిణీ చేయడంతో పాటు ఒక్కో ఓటరుపై రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చు చేసినట్లు ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్, టీఆర్ఎస్ (బీఆర్ఎస్), బీజేపీ పార్టీలు సమానంగా రంగంలోకి దిగి విజయం కోసం తీవ్రంగా శ్రమించాయి. గజ్వేల్ నియోజకవర్గానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌కు బలమైన ప్రదేశంగా భావించిన గజ్వేల్‌లో కేసీఆర్ ప్రవేశంతో టీఆర్ఎస్ రెండు పర్యాయాలు మున్సిపాలిటీలో జెండా ఎగరేసింది. ప్రస్తుతం కేసీఆర్ గజ్వేల్ నుంచి గెలుపొందినా రాష్ట్రంలో అధికారంలో లేకపోవడంతో ప్రతిపక్ష హోదాలో కొనసాగుతున్నారు. మూడోసారి కూడా మున్సిపాలిటీపై టీఆర్ఎస్ జెండా ఎగరేయాలని ఆ పార్టీ నాయకులు లక్ష్యంగా పెట్టుకోగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి మున్సిపల్ పీఠం తమదేనని ధీమా వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో పట్టణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈసారి బీజేపీకి అవకాశం లభిస్తుందని ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది గంటల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో అన్న ఉత్కంఠ నెలకొంది. ఏ పార్టీకి పట్టం కడతారో అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

# కన్నుల పండుగగా శ్రీ అంబటి మల్లన్న జాతర ఉత్సవాలు

- భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించిన భక్తులు

**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలం పరిధి మారేడుపల్లి గ్రామంలో శ్రీ అంబటి మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు గురువారం కన్నుల పండుగగా జరిగాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక కాంతులతో మెరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పట్నాలు, హోమాలు నిర్వహించి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు సంప్రదాయ వేషధారణలో బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకోవడం జాతరకు ప్రత్యేక శోభను చేకూర్చింది. జాతర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, ఉమ్మడి మండల అధ్యక్షులు శైలేందర్ రెడ్డి లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకోగా స్థానిక సర్పంచ్ బాలసాని శారద- మల్లేశం స్వాగతం పలికి అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం ఆలయ పూజారులచే పసుపు బండారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తుల కోసం సర్పంచ్ ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంను ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోగా ఉత్సవాలు కన్నుల పండుగగా సాగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంగ రమేష్, జీరెడ్డి మహేందర్ రెడ్డి, కొంగల జగదీశ్వర్ రెడ్డి, సింగిరెడ్డి లింగారెడ్డి, బెద్దల ప్రవీణ్, కోఆప్షన్ పూదరి రమేష్, పడిదం మొగిలి, పోలోజు శ్రీనివాస్, శ్రావణ్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్, మన్నె జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలో సీట్ల భర్తీకి ఆహ్వానం

**నేటి సాక్షి-మేడిపల్లి:** తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల మేడిపల్లిలో ఆరవ తరగతిలోకి ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదవ,తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకై నోటిఫికేషన్ వెలువడింది కావున మేడిపల్లి, భీమారం, మండలాల్లో గల ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల కొరకు 100 సీట్లు కలవు.అర్హత ఆసక్తి ఉన్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోగలరు. ఏడవ తరగతి నుండి పదవ తరగతిలో గల మిగిలిన సీట్ల భర్తీకై కూడా అర్హత ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోగలరని తెలంగాణ మోడల్ స్కూల్ మేడిపల్లి ప్రిన్సిపాల్ డి నాగ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. సైట్ అడ్రస wwwtelanganamscgggovin ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు పూర్తి వివరాలకు తెలంగాణ మోడల్ స్కూల్ మేడిపల్లి పాఠశాలలో సంప్రదించగలరు. దరఖాస్తు ఫీజు ఓసీ విద్యార్థులకు200 రూపాయలు బీసీ,ఎస్సి, ఎస్టిపిహెచ్ సి విద్యార్థులకు125 రూపాయలు అని తెలిపారు.


# పర్యావరణ కాలుష్యం అవగాహన



**నేటి సాక్షి తిరుమలాయపాలెం మెట్టు రుద్రరాజు:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ బాటిల్స్ ద్వారా జరిగే కాలుష్యాన్ని బాల బాలికలు కు వివరించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్య జైని వచ్చారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్య జైని మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ కాలుష్యం పైన అవగాహన పెరగాలని అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ ప్లాస్టిక్ అనే కాలుష్యం భూతాన్ని నివారించాలని సంకల్పాన్ని విద్యార్థుల్లో కల్పించడం కోసం 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల అందరికీ తమ సొంత ఖర్చుతో 120 స్టీల్ బాటిల్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సుబ్లేడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రావు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన

## సుబ్లేడ్ మండల సాధన సమితి సభ్యులు



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం మెట్టు రుద్రరాజు:** తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ ను నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కాకతీయుల కాలం నుండి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జర్నలిస్టుగా తన రచనలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన జర్నలిస్టు షోయబుల్లాఖాన్ పుట్టిన గడ్డైన సుబ్లేడ్ గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జనసమితి నాయకులు ఎమ్మెల్సీ కోదండరామ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ కార్యక్రమంలో సుబ్లేడ్ మండల సాధన సమితి సభ్యులు మాజీ సర్పంచ్ భూక్య వీరన్న, గండమల సుందర్ రావు, కంచం వీరన్న, మెట్టు ఆంజనేయులు, మెట్టు వెంకన్న (ట్రైలర్), గంధసిరి సత్యం, గంధసిరి సతీష్, మోటమర్రి లింగయ్య, పోలెపొంగు బాలరాజు, భూక్య రేఖ, దోమల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**నేటి సాక్షి తిరుమలాయపాలెంమెట్టు రుద్రరాజు:** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుబ్లేడు ,గోల్ తండా, తిరుమలాయపాలెం ఆయా గ్రామాల్లో మదర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో మదర్ సేవ ట్రస్ట్ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ మదర్ సేవ ట్రస్ట్ అధ్యక్షులు గండమల్ల ఐసయ్య, ప్రెస్ క్లబ్ కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు పదముత్తు హాజరయ్య నూక తోటి సాల్మన్ రాజు చారి కిరణ్ దారావత్ ఆటోజైత్ కొండమీద మహేష్ తదితరులు పాల్గొన్నారు



# భక్తుల భద్రతే లక్ష్యం

## పోలీసుల స్పష్టం

## కోటిలింగాలలో మహా శివరాత్రి భద్రత ఏర్పాట్ల పరిశీలన



**నేటి సాక్షి, ఎండపల్లి:** కోటిలింగాల శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా భక్తుల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు. పర్వదినాన్ని పురస్కరించుకుని భారీగా భక్తులు తరలివచ్చే అవకాశముండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సీఐ రాంనరసింహ రెడ్డి తెలిపారు. గురువారం వెల్గటూర్ ఎస్సై పి.ఉదయ్ కుమార్ తో కలిసి కోటిలింగాల ఆలయం, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా అదనపు పోలీసు బలగాలను మోహరించి, ముఖ్య ప్రవేశ ద్వారాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేస్తామన్నారు. పార్కింగ్ స్థలాలను గుర్తించి వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని భక్తులకు సూచించారు. ప్రజల సహకారంతోనే మహా శివరాత్రి వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించగలమని పోలీసులు పేర్కొన్నారు.